


# ప్రజా చైతన్యమే... లక్ష్యం

తెలుగు దినపత్రిక




ఎడిటర్ ఇన్ చీఫ్-మధుసూదనరావు చల్లా
Cell : 6302222748, 9492569010

Simultaneously circulated in Amaravathi, Hyderabad, Vijayawada, Nellore, Ongole, Guntur, Krishna, Chittoor, Kadapa & all Districts of Andhra Pradesh & Telangana.

సంపుటి:1 సంచిక:353 సోమవారం 16-2-2026 పేజీలు : 8 వెల: 3/-

LEGAL AFFAIRS
All legal Affairs About Lakshyam Telugu Daily, Should be filled in Guntur Courts Only

## ఏపీకి బిల్ గేట్స్ రాక..

- సంజీవని సహా సాంకేతిక సాగు ప్రాజెక్టుల పరిశీలన
- రియల్ టైమ్ గవర్నెన్సు, వివిధ అంశాలపై ప్రజెంటేషన్ ఇవ్వనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు


( file Photo)


**అమరావతి, ఫిబ్రవరి 15 (లక్ష్యం న్యూస్)** గేట్స్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ బిల్ గేట్స్ సోమవారం రాష్ట్రంలో పర్యటించనున్నారు. బిల్ గేట్స్ తో పాటు గేట్స్ ఫౌండేషన్ కు చెందిన 6గురు ప్రతినిధుల బృందం అమరావతిలోని రాష్ట్ర సచివాలయానికి రానుంది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ లతో కలిసి బిల్ గేట్స్ బృందం కొద్దిసేపు సమావేశం కానుంది. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రాన్ని బిల్ గేట్స్ సందర్శించనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్సు విధానాలు, దాని ద్వారా సాధిస్తున్న ఫలితాలను ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్ గేట్స్ కు వివరించనున్నారు. ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని కూడా గేట్స్ పరిశీలించనున్నారు. అనంతరం ముఖ్యమంత్రి సమావేశ మందిరంలో బిల్ గేట్స్ సహా గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి, మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు సమావేశం కానున్నారు. రాష్ట్రంలో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను మరింత విస్తరించే అంశంపై సమావేశంలో చర్చించనున్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణలపై ముఖ్యమంత్రి చంద్రబాబు క్లుప్తంగా ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. మెడ్ టెక్, డయాగ్నస్టిక్స్ సేవలు, సాంకేతిక సాగు సహా తదితర ప్రాజెక్టుల గురించి వివరించనున్నారు. ప్రత్యేకించి గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు గురించి రాష్ట్ర ప్రభుత్వం వివరించనుంది. అనంతరం అమరావతిలోని ఉండవల్లి గ్రామం వద్ద ఓ వ్యవసాయ క్షేత్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి బిల్ గేట్స్ బృందం సందర్శించనుంది. వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్లు, ఏఐ టెక్నాలజీ సహకారంతో చేపడుతున్న సాగు విధానాన్ని బిల్ గేట్స్ పరిశీలించనుంది.




## భారత్ క్రికెట్ టీంకు అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు..

# మహాశివుని ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

- ఆధ్యాత్మిక కేంద్రంగా ఏపీని తీర్చిదిద్దుతాం
- టెంపుల్ టూరిజంలో ఏపీకి తిరుగులేదు
- దేవాలయాల పరిరక్షణ, నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాం
- ప్రతి గుడిలో నిత్య దీపారాధన, నైవేద్యం మా సంకల్పం
- రాజధాని అమరావతి ప్రతిష్ట ప్రపంచ స్థాయికి చేరాలి
- మహాటీవీ నిర్వహించిన శివోహం కార్యక్రమలో సీఎం చంద్రబాబు









అమరావతి,ఫిబ్రవరి 15:(లక్ష్యం న్యూస్)
దేవాలయాల పరిరక్షణపై ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేకదృష్టి పెట్టిందని, రాష్ట్రంలో టెంపుల్ టూరిజానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని సూచించారు. గుంటూరు జిల్లా నంబూరులోని దశావతార ఆలయ ప్రాంగణంలో మహాటీవీ నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. వేదికపై చేపట్టిన పూజా కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...శివోహం కార్యక్రమాన్ని నిర్వహించిన మహాన్యూస్ సీఎండీ మారెళ్ల వంశీకృష్ణ, సిబ్బంది, నిర్వాహకులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. దేవతల రాజధాని, ప్రజా రాజధాని అమరావతిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం శుభ పరిణామం. పరమశివుడు చీకట్లు తొలగించి వెలుగులు ప్రసాదిస్తాడు. శివారాధనే ముక్తికి దగ్గర దారి. ఆనాడు సైబరాబాద్ నగరాన్ని నిర్మించాం. నేడు అమరావతి నిర్మిస్తున్నాం. అమరావతి భావితరాలకు ఆదర్శ నగరంగా నిలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి కీర్తి ప్రతిష్టలు పెంచుతుంది. రాష్ట్రం బాగుండాలని, సకాలంలో పోలవరం పూర్తి, నదుల అనుసంధానం, ప్రతి ఎకరాకు సాగునీరు అందించడం సహా సంపద సృష్టించి దాన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా తిరిగి పేదలకు అందేలా దీవించమని ఆ పరమశివుడిని ప్రార్థిస్తున్నాను. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. పేదరిక నిర్మూలన, అందరికీ సమాన అవకాశాలు, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు నిర్ధిష్ట ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం. ఏపీ అంటే క్వాంటమ్ వ్యాలీ, డేటా సెంటర్ , ఐటీ హబ్, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఎనర్జీ. సంపద సృష్టించాలంటే టెక్నాలజీ అవసరం. ఆనాడు హైదరాబాద్ లో ఐటీని ప్రమోట్ చేయడానికి మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ ను తీసుకొచ్చాను. నేడు ఏఐ, క్వాంటమ్ వచ్చాయి. 16వ తేదీన బిల్ గేట్స్ మన అమరావతి వచ్చి మరింత చేయూత అందిస్తారని ముఖ్యమంత్రి తెలిపారు.

**టెంపుల్ టూరిజంలో భాగంగా ఆలయాల అభివృద్ధి**

ఏపీని టెక్నాలజీలోనే కాకుండా ఆధ్యాత్మిక కేంద్రంగానూ అభివృద్ధి చేస్తున్నాం. ఆలయాలు, పుణ్యక్షేత్రాలకు మన రాష్ట్రం ప్రసిద్ధిగాంచింది. జ్యోతిర్లింగం, శక్తిపీఠం ఒకేచోట కొలువైన శ్రీశైల పుణ్యక్షేత్రం మన రాష్ట్రంలో ఉండటం అదృష్టం. పంచారామాలు, శ్రీకాళహస్తి, లేపాక్షి, ద్రాక్షారామం, మహానంది, శ్రీముఖ లింగం, కోటప్పకొండ వంటి ఆలయాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. దేవాలయాల సంరక్షణ, నిర్వహణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రతి ఆలయంలోనూ నిత్య దీపారాధన, నైవేద్యం పెట్టాలనేది మా విధానం. దేవాలయాల పవిత్రత, భక్తుల విశ్వాసం పెరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అలాగే భక్తుల మనోభావాలు, సెంటిమెంట్లను గౌరవిస్తాం. ఇటీవల కాలంలో ఆలయాలు, జాతరలకు భక్తుల రద్దీ పెరిగింది. స్త్రీ శక్తి ద్వారా ఉచిత ప్రయాణం అందుబాటులోకి రావడంతో దేవాలయాలకు వెళ్లే మహిళల సంఖ్య పెరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆనాడు ఎన్టీఆర్ తిరుమలలో అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేను ప్రాణదానం, శ్రీవారి సేవ కార్యక్రమాలు ప్రారంభించాను. దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధాని సహా గ్రామీణ ప్రాంతాల్లో 5 వేల దేవాలయాలు నిర్మించాలని తలపెట్టాం. ముఖ్యమంత్రిగా గోదావరి, కృష్ణా పుష్కరాలను మూడోసారి నిర్వహించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని ముఖ్యమంత్రి అన్నారు.

**ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం**

ప్రజల్లో ఆధ్మాత్మిక చైతన్యం తీసుకురావడంతో పాటు, తెలుగు నేలపై భక్తి ఉద్యమం నడుపుతున్న మహాటీవీ సీఎండీ వంశీకృష్ణను అభినందిస్తున్నాను. గతేడాది ఇదే ప్రాంతంలో శివోహం ఆ తర్వాత కాకినాడలో సీతారాముల కల్యాణం, హైదరాబాద్ గచ్చిబౌలిలో శ్రీనివాస కల్యాణం నిర్వహించారని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పద్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ, మంత్రాలయం పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామీజీ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

## ఉత్తరాంధ్ర ఉజ్వల భవిష్యత్తుకు బలమైన బడ్జెట్

### ఎమ్మెల్యే గౌతు శిరీష



**మంగళగిరి (లక్ష్యం న్యూస్)**
గత పాలకుల చేతకానితనంతో కుదేలైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మళ్ళీ ప్రగతి పథంలోకి తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ ఒక అద్భుతమైన 'బ్లూప్రింట్' అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కొనియాడారు. కోట్లాది మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పూర్తి నిబద్ధతతో ఈ బడ్జెట్‌ను రూపొందించినందుకు గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గారికి ధన్యవాదాలు తెలిపారు. ఇది కేవలం అంకెల గారడీ కాదని, ప్రతి సామాన్యుడికి అర్థమయ్యేలా, వారి జీవితాల్లో మార్పు తెచ్చేలా రూపొందించిన 'చేతల బడ్జెట్' అని కొనియాడారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రూ. 3,32,205 కోట్లతో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ అన్ని వర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తోంది. ముఖ్యంగా రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పన కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 53,915 కోట్లు కేటాయించడం ప్రభుత్వ సాహసోపేతమైన నిర్ణయమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కేవలం మాటలతోనే రైతులను మభ్యపెట్టింది. కానీ మా కూటమి ప్రభుత్వం రైతన్నను నిజమైన రాజును చేసేందుకు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు రూ. 13,598 కోట్లు కేటాయించింది. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో గత ఐదేళ్లుగా జరిగిన నిర్లక్ష్యాన్ని వీడి, అటు మేజర్ ప్రాజెక్టులతో పాటు ఇటు మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు ఈ బడ్జెట్ అద్దం పడుతోందని ఆమె వివరించారు. పేదవాడికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో గత బడ్జెట్ (రూ. 2000 కోట్లు) కంటే మూడు రెట్లు అధికంగా, ఈ ఏడాది రూ. 6,357 కోట్లు కేటాయించడం గర్వకారణమని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం కోసం ఏకంగా రూ. 91,000 కోట్లు కేటాయించాం. సాధారణ సంక్షేమ పథకాలకు గత ఏడాది రూ. 41,000 కోట్లు ఉంటే, ఈసారి దాన్ని రూ. 53,000 కోట్లకు పెంచడం మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. భావి భారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యతను యువ నాయకులు నారా లోకేష్ గారు భుజానికెత్తుకున్నారని అన్నారు. పాఠశాల విద్య కోసం ఏకంగా రూ. 32,308 కోట్లు కేటాయించడం ద్వారా విద్యారంగానికి మా ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత ఏంటో అర్థమవుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు అధ్వాన్న స్థితికి చేరుకున్నాయని విమర్శించారు. మన యువ నాయకులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు విద్యారంగానికి పెద్దపీట వేస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వసతులు కల్పించేందుకు భారీగా నిధులు కేటాయించారని తెలిపారు. ఇది విద్యార్థుల భవిష్యత్తును మార్చే 'గోల్డెన్ బడ్జెట్' అని ఆమె అభివర్ణించారు. "గత పాలకులు ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోవడం వల్లే రాష్ట్ర భవిష్యత్తు నాశనమైంది. కానీ మా ప్రభుత్వం ప్రజలపై ఒక్క రూపాయి కూడా అదనపు పన్ను భారం వేయకుండా, వారి జీవన ప్రమాణాలు పెరిగేలా ఈ బడ్జెట్‌ను సిద్ధం చేసింది. ఇది కేవలం బటన్ నొక్కే బడ్జెట్ కాదు.. ప్రతి ప్రాంతానికి అభివృద్ధిని పంచే బడ్జెట్. ఉత్తరాంధ్ర వాసిగా ఆ ప్రాంతం గత ఐదేళ్లలో ఎంతగా దోపిడీకి గురైందో అందరికి తెలిసిన విషయమే..గత పాలకులు 22 మంది ఎంపీలను గెలిపించుకున్నా, స్టీల్ ప్లాంట్‌ను కాపాడలేకపోయారని, పైగా అమ్మకానికి సిద్ధం చేశారని విమర్శించారు. విశాఖ హక్కు అయిన రైల్వే జోన్ విషయంలో గత ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదన్నారు. శ్రీకాకుళం జిల్లాకు జీవనాధారమైన వంశధార, నాగావళి, మహేంద్ర తనయ ప్రాజెక్టులను గత ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని.. ఒక్క చుక్క నీరు కూడా ఇవ్వలేని అసమర్థత వారిదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వంశధార, నాగావళి నీటిని రైతులకు అందించేలా చర్యలు తీసుకుందని తెలిపారు. ముఖ్యంగా పలాస, పాతపట్నం, టెక్కలి నియోజకవర్గాలకు తాగు, సాగు నీరు అందించే మహేంద్రతనయ ఆఫ్-షోర్ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు చెప్పారు.

## ఐలాపురం వెంకయ్య మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి

అమరావతి, ఫిబ్రవరి 15 (లక్ష్యం న్యూస్) ప్రముఖ బీసీ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య మృతి పట్ల సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. బీసీ వర్గాల అభ్యున్నతి, హక్కుల సాధన కోసం వెంకయ్య నిరంతరం పనిచేశారని ముఖ్యమంత్రి అన్నారు. నిరాడంబర జీవితాన్ని గడుపుతూ, అందరితో సత్సంబంధాలు కలిగిన వెంకయ్య మృతికి చంద్రబాబు సంతాపం తెలిపారు. వెంకయ్య కుటుంబ సభ్యులందరికీ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఐలాపురం వెంకయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని సీఎం చంద్రబాబు చెప్పారు.

లక్ష్యం
తెలుగు దినపత్రిక
సోమవారం 16-2-2026

# ఇలాపురం వెంకయ్య మృతిపై వైయస్ జగన్ దిగ్భ్రాంతి



తాడేపల్లి (లక్ష్యం న్యూస్): ప్రముఖ బీసీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ ఇలాపురం వెంకయ్య మృతిపై వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాపురం వెంకయ్య ప్రజలకు, సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. వారి మరణం కుటుంబ సభ్యులకు మాత్రమే కాక సమాజానికే తీరని లోటన్నారు. వెంకయ్య ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని కోరుకుంటూ, వెంకయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఇలాపురం వెంకయ్య.. ప్రముఖ బీసీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ, శనివారం (ఫిబ్రవరి 14)న మరణించారు. ఆయన మరణం ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని కలిగించింది. విజయవాడలో ఆయన వ్యాపార, రాజకీయ, సామాజిక సేవా రంగాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు.

# తెలుగు ప్రజలకు వైయస్ జగన్

## మహాశివరాత్రి శుభాకాంక్షలు



తాడేపల్లి:(లక్ష్యం న్యూస్) మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలకు మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. 'పరమశివుడి లింగోద్భవానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండగ.. పరమభక్తికి నిదర్శనం. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు ఆచరించే ఉపవాసం, జాగరణ నిష్టాగరిష్టతను చాటుతాయి' అని వైయస్ జగన్ అన్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైలం మల్లన్న స్వామివారి ఆలయం కొలువై ఉన్న పవిత్ర ప్రదేశం మన రాష్ట్రమని అభివర్ణించారు. మహాశివరాత్రి పర్వదినాన ఉపవాసం, జాగరణ చేసే భక్తులు భక్తి శ్రద్ధలతో శివార్చన, పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించిన వైయస్ జగన్.. రాష్ట్ర ప్రజలందరిపై ఆ పరమశివుడి అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు."నియమ నిష్టలు, భక్తి శ్రద్ధలు, జాగరణతో పరమశివుడిని ఆరాధించే ఈ పవిత్ర మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు" అంటూ వైయస్ జగన్ ట్వీట్ కూడా చేశారు. "ఆ మల్లికార్జునుడి ఆశీస్సులు అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. ఓం నమః శివాయ!" అని వైఎస్ జగన్ పోస్ట్ చేశారు.

# జగన్ పాలనలోనే గిరిజనులకు మేలు




తాడేపల్లి:(లక్ష్యం న్యూస్) వైయస్ జగన్ పాలనలోనే గిరిజనులకు ఆర్థికంగా, రాజకీయంగా మేలు జరిగిందని, ఆయన మళ్లీ సీఎం అయితేనే మరింత అభివృద్ధి జరుగుతుందని గిరిజన నాయకులు అభిప్రాయపడ్డారు. గిరిజనులంతా ఏకతాటిపైకి వచ్చి వైయస్ జగన్ గారిని సీఎంగా తీసుకొచ్చి మళ్లీ సీఎంని చేసుకోవాలని నిర్ణయించారు. గత ఐదేళ్ల పాలనలో గిరిజినులను ఆర్థికంగా సామాజికంగా ఆయన అండగా నిలబడినందుకు వారు కృతజ్ఞత తెలిపారు. తాడేపల్లి లోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర గిరిజన విభాగం ఆధ్వర్యంలో "శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్" 287 వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంచార జాతులుగా ఉండే బంజారాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ కే దక్కుతుందని నాయకులు చెప్పారు. పాదయాత్రలో వైయస్ జగన్ గారిని కలిసి 500 జనాభా ఉండే తండాలను గ్రామ పంచాయతీలుగా చేయాలని కోరగా అధికారంలోకి వచ్చిన వెంటనే 250 తండా పంచాయతీలను ఏర్పాటు చేసి ఇచ్చిన హామీని నెరవేర్చారని గుర్తుచేసుకున్నారు. రిజర్వేషన్లన్నీ ఏజెన్సీ ప్రాంతాలకే పరిమితమైన నేపథ్యంలో మైదాన ప్రాంతంలో ఉండే గిరిజనులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని వారు కోరారు. రాబోయే రోజుల్లో వైయస్ జగన్ గారు సీఎం అయ్యాక ఎరుకల, యానాది, లంబాడి, చెంచు కులస్తులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో కూడా లంబాడీలకు బోర్డు మెంబర్‌గా, శ్రీశైలం బోర్డులో మెంబర్లు అవకాశం కల్పించారని వారు ప్రశంసించారు. దీంతోపాటు ఎస్టీ కమిషన్ మెంబర్‌గా, ఎస్వీబీసీ ఛానెల్‌లో అడ్వైజర్‌గా ఒక మహిళకు అవకాశమిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు. అంతేకాకుండా వైయస్ జగన్ గారు సీఎంగా ఉండగా 1.53 లక్షల కుటుంబాలకు 3 లక్షల ఎకరాలు ఆర్వోఎస్ఆర్ పట్టాలు పంపిణీ చేశారని, 25 వేల కుటుంబాలకు 38717 వేల ఎకరాలు డీకేటీ పట్టాలిచ్చి గౌరవించారని చెప్పారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు గిరిజనలను పూర్తి విస్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుగాలి ప్రీతి హత్యాచారాన్ని రాజకీయంగా వాడుకుని ఎన్నికల్లో గెలిచిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా వారి కుటుంబానికి ఇంతవరకు న్యాయం చేయలేదని మండిపడ్డారు. కేసును సీబీఐతో విచారణ చేయిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. సుగాలి ప్రీతి కుటుంబానికి వైయస్ జగన్ సీఎంగా ఉండగా ఉద్యోగం, నగదు, ఇంటి స్థలం, పొలం ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. గిరిజనులకు న్యాయం చేయకపోగా బనగానపల్లి నియోజకవర్గంలో ఒక ఎంపీపీని గృహనిర్బంధం చేసి వేధించారని, మాచర్ల నియోజకవర్గంలో ఒక గిరిజన సర్పంచ్ జెండా ఆవిష్కరణ చేయకుండా టీడీపీ నాయకులు అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైయస్ జగన్ సీఎంగా ఉండగా డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా రూ. 19,471 కోట్ల మేర గిరిజనులకు లబ్ధి చేకూర్చారని చెప్పారు. గిరిజనులకు మేలు జరగాలంటే మళ్లీ వైయస్ జగన్‌ని సీఎం చేసుకోవాలని తీర్మాణం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రైకార్ మాజీ చైర్మన్ గుండా సురేంద్ర, వైయస్ఆర్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నారాయణ మూర్తి, పార్టీ నాయకులు రామావత్ కృష్ణ నాయక్, పార్టీ గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి ఏందేటి వెంకట సుబ్బయ్య , ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాండ్లవత్ శ్రీనివాసుల నాయక్, లంబాడా నాయకులు కోటేశ్వర నాయక్, మాచర్ల రవి నాయక్, చంద్ర నాయక్, డాక్టర్ గోపి నాయక్, చితురి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర ఉజ్వల భవిష్యత్తుకు బలమైన బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి )

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు విశాఖపట్నం, అమరావతి, తిరుపతి నగరాలను 'గ్రోత్ ఇంజన్లుగా' గుర్తించామని ఆమె తెలిపారు. నీతి ఆయోగ్ సహకారంతో విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌కు ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించామని, దీని ద్వారా శ్రీకాకుళం నుండి కోనసీమ వరకు సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం 7 గ్రోత్ డ్రైవర్లను గుర్తించిందని తెలిపారు. మానుఫ్యాక్చరింగ్, మౌలిక వసతులు, పట్టణీకరణ, వ్యవసాయం వంటి రంగాల్లో 41 కీలక ప్రాజెక్టులను అమలు చేయబోతున్నామని, ఇందులో మెట్రో రైలుతో సహా దాదాపు రూ. 28,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు ఉన్నాయని వివరించారు. "గత పాలకులు ఉత్తరాంధ్రపై చూపించింది కపట ప్రేమ మాత్రమే. ఋషికొండను తవ్వి, ప్రజల సొమ్ము రూ. 500 కోట్లతో ఒక ప్యాలెస్ కట్టుకున్నారు. ఆ ప్రజాధనాన్ని అభివృద్ధికి వాడి ఉంటే ఉత్తరాంధ్ర ఎంతో బాగుపడేది. వైసిపి హయాంలో విశాఖపట్నం లాంటి ప్రశాంత నగరం 'గంజాయి కేంద్రం'గా మారిపోయింది. చిన్న పిల్లలకు కూడా గంజాయి దొరికేలా చేసిన పాపం గత పాలకులదే" అని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు గారి విజన్ వల్ల భోగాపురం ఎయిర్పోర్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ జూన్ కల్లా రన్‌వే సిద్ధం చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాం. ఎయిర్పోర్ట్‌తో పాటు 136 ఎకరాల్లో ఏవియేషన్, ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ హబ్‌ను తీసుకువస్తున్నాం. దీనివల్ల వేలాది మంది స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి వలసలను నివారించేందుకు పలాస ప్రాంతంలో కార్గో



ఎయిర్పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. దీనివల్ల పలాస చుట్టుపక్కల అనేక అనుబంధ పరిశ్రమలు వస్తాయని, మన జిల్లా యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ వేధింపుల వల్ల ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, హెచ్‌సిఎల్ (ఎజూ), ఐబిఎం (×దీవీ) వంటి 14 దిగ్గజ కంపెనీలు విశాఖ వదిలి వెళ్లిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మళ్ళీ తన పూర్వవైభవాన్ని సంతరించుకుంటోందని, 2047 నాటికి 'స్వర్ణాంధ్ర' లక్ష్యాన్ని చేరుకోవడమే మా ధ్యేయమని స్పష్టం చేశారు. కేవలం 20 నెలల పాలనలోనే కూటమి ప్రభుత్వం అసాధ్యమైన పనులను సుసాధ్యం చేసి చూపిందని ఆమె పేర్కొన్నారు. "గతంలో పారిపోయిన కంపెనీలు ఇప్పుడు మళ్ళీ మన రాష్ట్రం వైపు చూస్తున్నాయి. ఎకనామిక్ సమ్మిట్లు, పెట్టుబడుల ప్రవాహం చూస్తుంటే 'బ్రాండ్ చంద్రబాబు' పట్ల పెట్టుబడిదారులకు ఉన్న నమ్మకం ఏంటో అర్థమవుతోంది. యువతకు కేవలం చదువు మాత్రమే కాదు, నారా లోకేష్ గారి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ఈ బడ్జెట్ అడుగులు వేస్తోంది." కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే కీలక హామీలను అమలు చేసింది. అన్నదాత సుఖీభవ పేరుతో రైతన్నకు పెట్టుబడి సాయం అందించింది. దీపం 2.0 ద్వారా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేసింది. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళల ఆర్థిక భారాన్ని తగ్గించే గొప్ప అడుగు ముందుకేసింది. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ఏడాదికి రూ. 15,000 చొప్పున ఆర్థిక సాయం అందించింది. బడ్జెట్ పై విమర్శలు చేస్తున్న వైసిపి నేతలకు బహిరంగ సవాల్ విసిరారు. "మీరు బూతులు మాట్లాడకుండా, కేవలం సబ్జెక్ట్ మీద మాట్లాడతామంటే చర్చకు మేం సిద్ధం. మీ ఐదేళ్ల అస్తవ్యస్త పాలన పక్కన పెట్టి, మా 20 నెలల అభివృద్ధిని చూపిస్తాం. తెలుగుదేశం పార్టీ కార్యకర్త కూడా మీకు సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నాడు." "సాక్షి లాంటి పత్రికలను, ఛానళ్లను అడ్డం పెట్టుకుని అబద్ధాలను నిజాలుగా నమ్మించాలని చూస్తే ప్రజలు నమ్మరు. ప్రజల కలలకు, ఆశలకు ప్రతిరూపమే ఈ 2026-27 బడ్జెట్. రాయలసీమ, ఉత్తరాంధ్ర, అమరావతి.. ఇలా అన్ని ప్రాంతాలకు, అన్ని వర్గాలకు సమన్యాయం చేసేలా ఈ బడ్జెట్ రూపొందించాం. ప్రజలందరూ ఒకసారి బడ్జెట్ వివరాలను చదివి వాస్తవాలను తెలుసుకోవాలని కోరుకుంటున్నాను. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తోందని, ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వంద శాతం నిలబెట్టుకుంటామని ఎమ్మెల్యే గౌతు శిరీష ధీమా వ్యక్తం చేశారు.

# మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది

## బడ్జెట్ పై ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

### : గుంటూరు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

మంగళగిరి (లక్ష్యం న్యూస్)

కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి తగిన ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... శాసనసభలో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ రాష్ట్ర చరిత్రలో ఒక మైలు రాయిగా నిలుస్తుంది. సంకల్పం ఉన్నచోట సాధనకు మార్గముంటుందన్నట్లుగా నేటి బడ్జెట్ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగపడేలా ఉంది. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా ఈ బడ్జెట్ ను భావించొచ్చు. కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల్లో మైనార్టీలకు పెద్దపీట వస్తోంది. గత ప్రభుత్వం చెల్లించకుండా పెట్టిపోయిన ఇమాం, మౌజన్ల గౌరవ వేతనాన్ని కూటమి ప్రభుత్వం చెల్లించింది. హజ్ యాత్రకు వెళ్లే ప్రతి హాజీకి లక్ష రూపాయలు కూటమి ప్రభుత్వం చెల్లిస్తోంది. ప్రధానమంత్రి జన్ వికాస్ యోజన ద్వారా రాష్ట్ర మైనార్టీల సంక్షేమానికి 300 కోట్లు మంజూరు అయింది. ఉర్దూ భాషాభివృద్ధి, తదితరవాటికి రూ. 7.78 కోట్లు కేటాయించాం. ఉర్దూ ఘర్, ఉర్దూ లైబ్రరీల అభివృద్ధికి రూ. 2.85 కోట్లు కేటాయించాం. మైనార్టీ నిరుద్యోగులకు నిష్ణాతులచే కోచింగ్ ఇప్పించి, వారిని ప్రయోజకులను చేయడానికి రూ. 3.97 కోట్లు కేటాయించాం. ఉర్దూని రెండవ మాతృభాషగా ప్రకటించి గాలికొదలేసిన వైసీపీ ప్రభుత్వంలా కాకుండా ఉర్దూను అభివృద్ధి చేయాలి, ఉర్దూ పాఠశాలల్ని అభివృద్ధి చేయాలి, ఉర్దూలో చదువుకునే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఉర్దూ అభివృద్ధికి రూ. 7.83 కోట్లు కేటాయించడం జరిగింది. మైనార్టీలకు పెద్దపీట వేస్తూ.. తల్లికి వందనం పథకాన్ని 15 శాతం మైనార్టీలకు కేటాయించడం జరిగింది. సామాజిక పెన్షన్ ల పంపిణీలో మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నాం.

రెవెన్యూ లోటును తగ్గించేలా బడ్జెట్ ఉంది

ప్రజల జీవన విధానంలో మార్పులు తెచ్చే విధంగా ఈ బడ్జెట్ ఉంది. పేదల సంక్షేమ పథకాల ద్వారానే ప్రజల భవిష్యత్తును మార్చగలమని ఊహించి, ప్రజలకు అవసరమైన అన్ని అంశాల్లోనూ బడ్జెట్ కేటాయింపులు, ప్రతిపాదనలు ఏ విధంగా ఉపయోగపడతాయో ఆలోచించి బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. విద్య, వైద్యం, పాఠశాల వ్యవస్థ, ఉద్యోగుల భద్రత, రాష్ట్రంలో పెట్టుబడులు తెచ్చే అవకాశం అన్నింటిని ముందుచూపుతో ఈ బడ్జెట్ రూపకల్పన చేయడం జరిగింది. అసెంబ్లీకి వెళ్లి సమస్యలు విన్నవించాలని వైసీపీ నాయకులకు ఓట్లు వేసి గెలిపిస్తే.. ఇంట్లో కూర్చొని అసెంబ్లీకి రాకుండా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారు. వైసీపీ పరిపాలనలో రెవెన్యూ లోటు అధికంగా ఉంది. మూల ధన వ్యయాన్ని గతంలో వైసీపీ ప్రభుత్వం ఎంతవరకు ఖర్చు చేశారో ప్రజలకు తెలపాల్సిన అవసరముంది.

బడ్జెట్ కేటాయింపు భేష్

నేడు అర్బన్ డెవలప్ మెంట్ కు అమృత్ పథకం లో భాగంగా 2.ా కింద 117 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడం జరిగింది. అందులో భాగంగా రూ. 400 కోట్లు కేటాయించాం. రహదారులకు 6,39 కి.మీ.ల మేర రోడ్లు వేయడానికి 2,499 కోట్లు కేటాయించాం. రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తు కోసం, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 2026-27 బడ్జెట్ రూపకల్పన చేయడం జరిగింది. కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్ మొత్తం 3 లక్షల 32 వేల కోట్ల రూపాయలతో ప్రవేశపెట్టడం పట్ల సామాన్యుల నుండి ఉద్యోగాలు చేసుకునేవారి వరకు అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో కేవలం 7 శాతంగా ఉన్న మూలధన వ్యయాన్ని, ఈ ప్రభుత్వం 17 శాతానికి (సుమారు 56,000 కోట్లు) పెంచింది. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా చదువుకోవాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ పథకానికి 9,668 కోట్ల రూపాయల కేటాయించడం జరిగింది. పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యంగా అన్నా క్యాంటీన్ల సంఖ్యను 275కి పెంచడం జరిగింది. స్కిల్ డెవలప్‌మెంట్ కోసం 1,232 కోట్ల రూపాయలు, యువత, క్రీడల కోసం 438 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ద్వారా గూగుల్ వంటి దిగ్గజ సంస్థల నుండి 13 లక్షల కోట్ల పెట్టుబడుల సాధనే లక్ష్యంగా పేర్కొనడం జరిగింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడ చూసినా రోడ్లపై గుంతలే, వీరి హయాంలో ఎక్కడా తట్టెడు మట్టి వేయలేదు, ఒక్క గుంత పూడ్చలేదు. ఇలా గతంలో నిర్లక్ష్యానికి గురైన రహదారుల కోసం 2,499 కోట్ల రూపాయలతో 639 కి.మీ. మేర కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టనున్నాం. మైనారిటీల కోసం గతంలో కంటే ఎక్కువగా 6,090 కోట్ల రూపాయల కేటాయింపు జరిగింది. హజ్ యాత్రికులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నాం. అమృత్ 2.0 కింద పట్టణాల్లో 117 ప్రాజెక్టులకు 400 కోట్లు, అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగింది. చరిత్రలో తొలిసారిగా 'ట్రూ డౌన్' పేరుతో విద్యుత్ ఛార్జీలను 13 పైసలు తగ్గించిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని చెప్పుకోవచ్చు. ఆక్వా రైతులు, చేనేత మరియు ఇతర వర్గాల విద్యుత్ సబ్సిడీల కోసం 11,000 కోట్ల రూపాయల వ్యయం కేటాయించడం జరిగింది. కొత్తగా 100 కోర్టు భవనాల నిర్మాణం కోసం 349 కోట్ల రూపాయల కేటాయింపు జరిగింది. రాజధాని అమరావతిలో 56,000 కోట్ల రూపాయలతో 96 పనుల పునరుద్ధరణ, పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించడం జరిగింది. గత ప్రభుత్వ 12.3% అధిక వడ్డీ రుణాలను 'డెత్ స్వాపింగ్' ద్వారా తగ్గించి, రాష్ట్ర ఖజానాకు 1,658 కోట్లు ఆదా చేయడం జరిగింది. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన 24,811 కోట్ల రూపాయల



బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించింది. ఎన్టీఆర్ నగర్స్ పేరుతో 25 లక్షల మందికి ఇళ్ల పట్టాలు, గృహాల కేటాయింపు చేస్తున్నాం. అలాగే చేనేత వర్గాలకు, నాయి బ్రాహ్మణులకు, ఆక్వా కల్చర్ రైతులకు, రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక రైతు లబ్ది పొందే విధంగా నేడు సబ్సిడీ రూపేణ దాదాపు 11 వేల కోట్ల రూపాయలను కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. మనం ఎంచుకున్న మార్గాల ద్వారానే రేపటి భవిష్యత్తు నిర్ణయించగలుగుతామనే ఆలోచనతో ఈ ప్రభుత్వం ముందుకెళ్తోంది. రాష్ట్ర అభివృద్ధి కోసం అనేక విధాలుగా కృషి చేస్తూ రాష్ట్ర రాజధాని అమరావతిని ముందుకు తీసుకెళ్తోంది. అమరావతి నిర్మాణానికి దాదాపు 56 వేల కోట్ల రూపాయలతో 96 పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది. రాష్ట్ర రాజధానిని ఇంటర్నేషనల్ స్థాయికి తీసుకెళ్లాలని ఉన్నాం. రాష్ట్రానికి సంజీవని లాంటి పోలవరాన్ని పూర్తిచేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అభివృద్ధి ఒకవైపు, సంక్షేమం మరొకవైపు రెండు కళ్ళులా చూస్తున్నాం. రాష్ట్రంలోని ప్రతి పేదవాడు నేడు సంతోషంగా ఉండడానికి ఈ బడ్జెట్ రూపొందించడం జరిగింది. అసెంబ్లీలో బడ్జెట్ ప్రకటన జరుగుతుంటే అసెంబ్లీకి రాకుండా మైకులు పెట్టుకొని తమకు సంబంధించిన మీడియాలో మాట్లాడుకోవడం చాలా విడ్డూరంగా ఉంది. గతంలో వైసీపీ నాయకులు ఏ ఆలోచనతో పనిచేశారో అందరం చూశాం. వనరులను దోపిడీ చేశారు. వారికి చెందిన కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు. మైనార్టీల సంక్షేమాన్ని ఏ కోశాన చూడలేదు. వారు ఆనాడు చెప్పిన వాగ్దానాల్ని ఒక్కటి కూడా నెరవేర్చలేదు. మౌజన్, ఇమాం లకు పెండింగ్ పెట్టి పోయిన బకాయిల్ని కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రూ.90 కోట్లు ఇచ్చి వారిని ఆదుకుంది. జగన్మోహన్ రెడ్డి అనాలోచిత విధానాలతో రాష్ట్రం రెవెన్యూ లోటు ఏవిధంగా ఉందో అందరికి తెలుసు. పెట్టుబడి, మూల ధన వ్యయం ఏ విధంగా చేశారో గమనించాలి. కేవలం 7 శాతం మాత్రమే మూల ధన వ్యయాన్ని ఖర్చు పెట్టారు. నేడు కూటమి ప్రభుత్వం 20 నెలల కాలంలోనే 17 శాతానికి మూల ధన వ్యయాన్ని ఖర్చు పెడుతూ రాష్ట్రంలో రోడ్లు, పాఠశాల భవనాలు, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది.

# మహాశివరాత్రి సందర్భంగా తదుపరి రోజున ఫిబ్రవరి 16న ఐచ్ఛిక సెలవు

- పీజీఆర్ఎస్ / రెవెన్యూ క్లినిక్ రద్దు
- 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా అర్జీలు స్వీకరణ
- కలెక్టర్ కీర్తి చేకూరి



రాజమహేంద్రవరం, (లక్ష్యం న్యూస్)

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని తదుపరి రోజూ (16వ తేదీ, సోమవారం) రాష్ట్ర ప్రభుత్వం ఐచ్చిక సెలవు ప్రకటించిన దృష్ట్యా జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో నిర్వహించాల్సిన పీజీఆర్ఎస్ / రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను ఫిబ్రవరి 16 వ తేదీన రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులు అందజేయడానికి సంబంధిత కార్యాలయాలకు రావద్దని అర్జీదారులను కోరారు. తదుపరి సోమవారం నుండి కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని వెల్లడించారు.ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1100 టోల్ ఫ్రీ కాల్ సెంటర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు సేవలను విస్తృతంగా వినియోగించు కోవాలని సూచించారు. ఫిర్యాదులను 1100 ద్వారా నమోదు చేసుకోవచ్చని, అదే విధంగా ఆయా అర్జీల పరిష్కార స్థితిని తెలుసుకునే అవకాశం ఉందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 95523 00009 కు ఫోన్ చేసి సత్వర పౌర సేవలు పొందవచ్చని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు.

ప్రజా చైతన్యమే...
లక్ష్యం
తెలుగు దినపత్రిక
సోమవారం 16-2-2026


## రేపటి నుండి సహకార సంఘాలు నిరవధిక సమ్మె కు సిద్ధం

**- సంఘ రాష్ట్ర నాయకులు చంద్ర రవి కుమార్తోట కృష్ణారావు**

**చల్లపల్లి ఫిబ్రవరి 15 లక్ష్యం న్యూస్**

రాష్ట్రంలో ఉన్న అన్ని సహకార సంఘాలు సోమవారం నుండి నిరవధిక సమ్మెకు సిద్ధమైనట్లు సహకార సంఘ రాష్ట్ర నాయకులు చంద్ర రవి కుమార్ తెలిపారు. ఆదివారం రవి కుమార్ తోట కృష్ణారావు విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక జేఏసీ ఆధ్వర్యంలో డిసెంబర్ ఐదో తారీకు నుండి దశల వారి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. సహకార సంఘం ఉద్యోగస్తుల న్యాయమైన డిమాండ్ల కోసం దశల వారి పోరాటం చేసినప్పటికీ యాజమాన్యం ప్రభుత్వం దగ్గర నుంచి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం పై ఎటువంటి స్పష్టమైన హామీలు రాలేదని వివరించారు. ఈ నేపథ్యంలో సోమవారం నుండి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2051 సహకార సంఘాలు నిరవధిక సమ్మె కు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. సమస్యలు సానుకూలంగా పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. అంతకు ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని , ఆమరణ నిరాహార దీక్ష కూడా చేపడతామని పేర్కొన్నరు. ఉద్యోగుల డిమాండ్లు న్యాయబద్ధమైనవని గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో జీవో నెంబర్ 36 ను చివరి క్యాబినెట్లో ఆమోదించటం జరిగిందని, తదుపరి ప్రభుత్వం మారడం వల్ల ఆ జీవో 36 అమలు నోచుకోలేదు ఇప్పుడు వెంటనే ఆ జీవో ని అమలు చేయాలని అలాగే రెండు పీఆర్సీలను కమిటీ వేసి ఐఆర్ వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. 2019 తర్వాత సహకార సంఘాలలో పని చేస్తున్న ఉద్యోగస్తులందరిని పర్మినెంట్ ఉద్యోగస్తులుగా గుర్తించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగస్తుల వలె వయోపరిమితిని 60 నుండి 62 సంవత్సరాలు కు పెంచాలని, చట్ట ప్రకారం గ్రాట్యూటిని ఇవ్వాలని ఉద్యోగస్తుల డ్యూటు లను తొలగించాలని డిమాండ్స్ అన్నిటిని కూడా సానుకూలంగా పరిశీలించాలని అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో సహకార సంఘాలలో జరుగుతున్న సమ్మెకు రైతులు ఇబ్బందికి గురి అవుతారని, వెంటనే సమస్యలు పరిష్కరించి జరగబోవు సమ్మె విరమణ కు చర్యలు తీసుకోవాలని రవికుమార్ కృష్ణారావు కోరారు. ఈ సమావేశంలో సహకార సంఘాల ఉద్యోగుల ఐక్యవేదిక జేఏసీ నాయకులుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు





**ఇబ్రహీంపట్నం,ఫిబ్రవరి: 15 (లక్ష్యం ప్రతినిధి )**

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి కార్యక్రమం మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు జరిగింది సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి మాజీ మంత్రివర్యులు శ్రీ జోగి రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బంజారాల సంస్కృతి ఆధ్యాత్మికత జోడించి గిరిజనులను చైతన్యవంతులను చేసిన మహోన్నత వ్యక్తి సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. నేటి యువతరం ఆయన ఆశయాలను అనుగుణంగా నడుచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్న రాణి, ఇబ్రహీంపట్నం వైస్ ఎంపీపీ బాణావత్ నాగ బాలమ్మ, పొందుగుల సర్పంచ్ గుగ్లూత్ కోటమ్మ, ఎన్టీఆర్ జిల్లా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జనరల్ సెక్రెటరీ ధారావత్ బాలాజీ, మైలవరం నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షులు బాణావత్ బాలాజీ, స్వామి, రాంబాబు, ధారావత్ సాయి, ఎక్స్ ఎంపీటీసీ పంతులు నాయక్, కోటయ్య, మదర్, సీతయ్య, ఈ కార్యక్రమానికి తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం: చీమలపాడులో పోలీసుల 'సైకిల్ ర్యాలీ'

**ఎన్టీఆర్ జిల్లా. ఏ కొండూరు మండలం,ఫిబ్రవరి: 14 (లక్ష్యం ప్రతినిధి)**

ఏ కొండూరు మండలం చీమల పాడు కూటమి ప్రభుత్వం తల పెట్టిన డ్రగ్స్ పై దండయాత్ర కార్యక్రమమును రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులతో గ్రామ గ్రామాన పోలీస్ అధికారులు సైకిల్ తో ర్యాలీగా తిరుగుతూ డ్రగ్స్ వద్దు ఆరోగ్యం ముద్దు అనే నినాదంతో ర్యాలిచేస్తూ ఆ కార్యక్రమంలో అధికారపార్టీ మండల గ్రామ పార్టీ సీనియర్ రమేష్ రెడ్డి ఏ కొండూరుమండల పార్టీ అధ్యక్షుడు బరోతు పీక్ల నాయక్నాయకులు కార్యకర్తలు మరియు స్కూల్ పిల్లలు వెలుగు NREGS వర్కర్లు స్కూల్ అధ్యపక్ సిబ్బంది పోలీస్ సిబ్బంది వివిధ సంఘాల నాయకులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శివయ్య సాక్షిగా.. మద్యం దందా!



**ఎన్టీఆర్ జిల్లా మైలవరం, ఫిబ్రవరి: 15 (లక్ష్యం ప్రతినిధి )**

- మైలవరం మండలం వెల్వడం బాలకోటేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో మద్యం గొలుసు దుకాణం
- గుడి ఎంట్రన్స్ వద్ద పార్కింగ్ సమీపంలో బెల్ట్ షాపు
- బాటిల్ పై 50 రూపాయలు అదనపు ధరకు అమ్మకాలు
- శివయ్య దర్శనానికి వచ్చిన భక్తులు అవాక్కు
- గుడి పరిసరాల్లో ఇవేం పాడు పనులంటూ విమర్శలు
- చోద్యం చూస్తున్న అధికారులు దీనిపై చర్య తీసుకుని ఎక్సేంజ్ శాఖ మైలవరం

## ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, విజయాలు కలగాలి

**: ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని**




**జి కొండూరు,ఫిబ్రవరి: 15 (లక్ష్యం ప్రతినిధి)**

ఈ పవిత్రమైన మహా శివరాత్రి సందర్భంగా భగవంతుడు పరమేశ్వరుడు మీకు, మీ కుటుంబానికి శాంతి, శక్తి, ఆయురారోగ్యాలు, విజయాలు ప్రసాదించాలని కోరుకుంటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని మైలవరం నియోజకవర్గ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి అంకెం సురేష్

"ఓం నమః శివాయ" హర హర మహాదేవ్

# భక్తులతో పోటెత్తిన దక్షిణ కాశీ పెదకళ్ళేపల్లి

- మహాశివరాత్రి ని పరిష్కరించుకొని పుణ్యాస్నాలను ఆచరించిన భక్తులు
- పితృదేవతలకు పెద్దలకు పిండ ప్రధానం చేసిన భక్తులు
- భక్తులతో కిటకిటలాడిన దుర్గ నాగేశ్వర స్వామి దేవస్థానం
- క్యూలో నిలిచి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించిన భక్తులు
- లక్షకు పైగా భక్తులు దక్షిణ కాశీకి తరలివచ్చిన భక్తులు
- ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు
- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీరామ్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు











**మోపిదేవి ఫిబ్రవరి 15 లక్ష్యం న్యూస్**

మహాశివరాత్రిలను పురస్కరించుకొని భక్తులతో దక్షిణ కాశీ పెదకళ్ళేపల్లి పోటెత్తింది రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు పెద్ద ఎత్తున దక్షిణ కాశీకి తరలివచ్చి కృష్ణా నది లో పుణ్య స్నానాలను చేసి పితృదేవతలకు పెద్దలకు పిండ ప్రధానం చేశారు పెదకళ్ళేపల్లి కృష్ణానది ఒడ్డున ఏర్పాటు చేసిన స్నానాలు ఘాటు వద్ద భక్తుల స్నానాలను ఆచరించి అనంతరం పిండా ప్రధానం చేయడంతో పాటు అక్కడనుండి తిరిగి పెదకళ్ళేపల్లి శ్రీ దుర్గా నాగేశ్వర స్వామి దేవస్థానానికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్షకు పైగా భక్తులు రాష్ట్ర నలుమూలల నుండి తరలి రావడంతో ఆ ప్రాంతం జన సందోహముగా మారింది పెదకళ్ళేపల్లి నుండి కృష్ణ తీరం వరకు సుమారు కిలోమీటర్ పైనే కాలినడకన నడిచి చేరుకున్నారు భక్తులు ఒక ప్రక్కన మండుటెండలు వేస్తున్న ఎండలను సైతం లెక్కచేయకుండా భక్తులు కాలినడకన కృష్ణానది వడ్డీకి చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దారి పొడవున త్రాగునీరు మజ్జిగ పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు కృష్ణానది ఒడ్డున వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం చేశారు అంతేకాకుండా కృష్ణా నది తీరం ఒక ప్రక్కన పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో మరో ప్రక్కన గంగిరెద్దుల విన్యాసాలతో సందడి నెలకొంది అంతే కాకుండా దుర్గా నాగేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఆ ప్రాంతం భక్తులతో కిక్కిరిసి భక్తజన సందోహముగా మారడంతో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసులు ఎక్కడకక్కడ భక్తులను అప్రమత్తం చేశారు మైకు ద్వారా భక్తులకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచిస్తూ భక్తులను అప్రమత్తం చేయడం విశేషం వివిధ సంఘాల నాయకులు రాజకీయ నాయకులు స్వచ్ఛంద సంస్థల నేతలు భక్తులకు మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేసి మజ్జిగను పంపిణీ చేశారు

దుర్గా నాగేశ్వర స్వామి దర్శించుకున్న మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలచౌరి

మహాశివరాత్రి ను పరిష్కరించుకొని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలచౌరి ఆదివారం దక్షిణ కాశీ పెదకళ్ళేపల్లిలో గల దుర్గా నాగేశ్వర స్వామి దేవస్థానాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు ఆయనకు ఆలయ అర్చకులు కార్యనిర్వాహణాధికారి శ్రీరామ్ వరప్రసాద్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు అలాగే అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ కుటుంబ సమేతంగా మోపిదేవి మండలం పెదకళ్ళేపల్లి చేరుకుని అక్కడ దుర్గా నాగేశ్వర స్వామి దేవస్థానాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించడంతోపాటు వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున తరలివస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్య తీసుకోవాలని సూచించారు అలాగే అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పెదకళ్ళేపల్లి దుర్గా నాగేశ్వర స్వామి దేవస్థానం సందర్శించి పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు

### భక్తులతో కిక్కిరిసిన శివ క్షేత్రాలు

మహాశివరాత్రి నన్ను పురస్కరించుకుని శివ క్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి తెల్లవారుజాము నుండి భక్తులు పెద్ద ఎత్తున శివ క్షేత్రాలకు తరలివచ్చి అక్కడ స్నానాలను ఆచరించి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు చల్లపల్లి మండలం యార్లగడ్డ లో గల బాల కోటేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆ ప్రాంతం భక్తులతో కిక్కిరిసింది భక్తులు అక్కడ స్నానాలను ఆచరించి క్యూలో నిలిచి ముందుగా నాగ పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు బాల కోటేశ్వర స్వామి దేవాలయానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు వారి పశువులను తీసుకొని వచ్చి దేవాలయం చుట్టూ ప్రదక్షిణాలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు సుదూర ప్రాంతాల నుండి భక్తులు ఎడ్లబండ్లపై తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కుబడును చేర్చుకున్నారు అలాగే అవనిగడ్డ మండలం అవనిగడ్డ పాత ఎడ్లంక లో మహాశివరాత్రి ను పరిష్కరించుకొని భక్తులు కృష్ణా నదులు పుణ్యస్నానాలు ఆచరించి అక్కడ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు వివిధ ప్రాంతాల నుండి భక్తులు ఎడ్లబండ్లపై ప్రభలను అలంకరించి ఆలయానికి చేరుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణాలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు కృష్ణానది వద్ద గల స్నానాలు ఘాటు వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ఏర్పాటు చేయడంతో పాటు కట్టుతిట్టమైన చర్యలు చేపట్టారు ముందస్తు చర్యలో భాగంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు మండుటెండను సైతం లెక్కచేయకుండా తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా త్రాగునీరు ఏర్పాటు చేయడంతో పాటు మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు కొంతమంది దాతలు అలాగే శివాలయాల లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు మహాశివరాత్రిలను పురస్కరించుకొని అవనిగడ్డ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది చల్లపల్లి నుండి మంగళాపురం మీదుగా మరియు చల్లపల్లి నుండి వెంకటాపురం మీదుగా పెదకల్లేపల్లికి బస్సులను ఏర్పాటు చేయడంతో వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు ఆర్టీసీ చల్లపల్లి బస్టాండ్ నుండి పెదకెళ్ళేపల్లికి చేరుకున్నారు ఈ సందర్భంగా చల్లపల్లి నుండి పెదకళ్ళేపల్లికి ఆటో చార్జీల కు రెక్కల వచ్చాయి అధిక చార్జీలు వసూలు చేస్తున్నట్లు భక్తులు తెలుపుతున్నారు

## భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ చేసి భక్తుల దాహం తీర్చిన జనసైనికులు








**చల్లపల్లి ఫిబ్రవరి 15 లక్ష్యం న్యూస్**

మహాశివరాత్రి నీ పురస్కరించుకుని పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులకు ఎలాంటి త్రాగునీటి ఇబ్బంది కలక్కుండా చల్లపల్లి పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ సెంటర్లో చల్లపల్లి పి ఎస్ సి ఎస్ అధ్యక్షులు వీరబాబు ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుండి చల్లపల్లి చేరుకుని పెదకళ్ళేపల్లి మహాశివరాత్రికి తరలి వెళ్లే భక్తులకు మజ్జిగను అందించి భక్తుల దాహం తీర్చారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు వీరబాబు గోళ్ళ ప్రసాద్ అడపా రవి లతోపాటు తదితరులు పాల్గొన్నారు

## కూటమి ఆధ్వర్యంలో ఐదు వేల మంది భక్తులకు మజ్జిగ పంపిణీ













### స్వామివారిని దర్శించుకుని పంపిణీ ప్రారంభించిన మండలి వెంకట్రామ్

**మోపిదేవి: ఫిబ్రవరి 15 లక్ష్యం న్యూస్**

మహాశివరాత్రి పర్వదిన వేడుకలు పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మోపిదేవి మండలం పెదకళ్ళేపల్లిలోని శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని ఆదివారం అవనిగడ్డ నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. ఆయనకు కూటమి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. మహాశివరాత్రి వేడుకలకు తరలివచ్చిన భక్తుల దాహార్తిని తీర్చేందుకు కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఐదు వేల మంది భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, మండలి వెంకట్రామ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి వేళ మతసామరస్యానికి చిరునామాగా నిలిచిన ముప్పిడి నాగేశ్వరరెడ్డి

**రెడ్డిగూడెం,ఫిబ్రవరి :15( లక్ష్యం ప్రతినిధి )**

రెడ్డిగూడెం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజానాయకుడుముప్పిడి నాగేశ్వరరెడ్డి మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మిత్రుడు ప్రత్తిపాటి లక్ష్మణరావు నిర్వహిస్తున్న చర్చిలో జరిగిన ప్రత్యేక దైవ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ప్రార్థన కార్యక్రమంలో భాగంగా లక్ష్మణరావు దేవుని సందేశాన్ని వినిపిస్తూ ప్రేమ, శాంతి, క్షమాభావం వంటి విలువలు సమాజ నిర్మాణానికి మూలస్థంభాలని పేర్కొన్నారు. భక్తి మార్గం మనుష్యులను ఐక్యంగా నిలబెడుతుందని, పరస్పర గౌరవంతో జీవించడం ద్వారానే సమాజంలో శాంతి నెలకొంటుందని ఆయన సందేశంలో వెల్లడించారు.

ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ, పర్వదినాలు మనలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడమే కాకుండా సమాజానికి సేవ చేయాలనే సంకల్పాన్ని బలపరుస్తాయని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో దేవుని ఆశీస్సులు నిండాలని ఆకాంక్షిస్తూ, మతసామరస్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి గారు ఆరాధన కానుక సమర్పించి భక్తిశ్రద్ధలను వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన ఆత్మీయ స్నేహ విందులో భాగస్వాములయ్యారు కార్యక్రమంలో మండల పార్టీ ముప్పిడి నాగేశ్వర్ రెడ్డి ఉయ్యూరు సుబ్బారెడ్డి.స్థానిక పార్టీ.నాయకులు, విశ్వాసులు పాల్గొన్నారు.







# మహాశివరాత్రి సందర్భంగా శివాలయాల వద్ద కట్టుదిట్టమైన భద్రత పెందుర్తి సీఐ సతీష్ కుమార్ ప్రత్యేక పర్యవేక్షణ

**పెందుర్తి, ఫిబ్రవరి 15 : (లక్ష్యం ప్రతినిధి)**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రముఖ శివాలయాల వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా పెందుర్తి సర్కిల్ కె.వి. సతీష్ కుమార్ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి, అవసరమైన భద్రతా చర్యలను పర్యవేక్షించారు. ప్రహ్లాదపురం, పల్లి నారాయణపురం, వేపగుంట, చిమలపల్లి, చింతగట్ల అగ్రహారం, నరవ, నరవ పంప్ హౌస్, జెర్రిపోతులపాలెం, సత్తివానిపాలెం, పినగడి, హరిహర కాట్రం (సుజాతానగర్), ఇంద్రాణి ఫంక్షన్ హాల్ వద్ద శివాలయం, చినముషిడివాడ శివాలయం, సరిపల్లి, ప్రశాంతి నగర్, సాధు మఠం, నల్లా క్వారీ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు సౌకర్యవంతంగా దర్శనం చేసుకునే విధంగా ట్రాఫిక్ నియంత్రణ, క్యూ లైన్ల ఏర్పాటు, పార్కింగ్ సదుపాయాలు, మహిళా భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు, రాత్రివేళల్లో అదనపు పహారా వంటి ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ప్రాంతాల్లో కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ మాట్లాడుతూ, మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులు పోలీసు శాఖకు సహకరించి క్రమశిక్షణతో దర్శనం చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.




# శివనామస్మరణతో మారుమ్రోగిన పెదకాకాని శివాలయం








## -మహాశివరాత్రి సందర్భముగా పోటెత్తిన భక్తులు
## - కనులు పండుగ కాకాని శివయ్య కళ్యాణం

**పెదకాకాని, ఫిబ్రవరి 15. లక్ష్యం న్యూస్:**

పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానము మహాశివరాత్రి సందర్భంగా శివనామ స్వరముతో భక్తులతో కిటకిటలాడినది. శ్రీ భ్రమరాంబ అమ్మవారు శ్రీ స్వర్ణ కవచాలంకృత భ్రమరాంబదేవిగా భక్తులకు అనుగ్రహించినారు. తెల్లవారుజాము గం.3.00 నుండి భక్తులను దర్శనము అనుమతించారు. మహాశివరాత్రి పురస్కరించుకొని జిల్లా నలుమూలలు నుండే కాక ఆయా ప్రాంతముల నుండి వేలాదిగా మంది భక్తులు తరలివచ్చారు . ఆలయ ప్రాంగణం అంతా శివనామస్మరణతో మారుమ్రోగింది ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్, ధర్మకర్తలమండలి ఛైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు, ధర్మకర్తలమండలి సభ్యులు అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యముగా క్యూలైనులు ఏర్పాటు చేసి భక్తులకు సకాలములో స్వామి వారి దర్శనము కలిగేలా చర్యలు తీసుకున్నారు. ఉదయం గం.11.00 సమయములో ఆలయ ప్రాంగణము అంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. క్యూలైనులలో భక్తుల సౌకర్యార్థము త్రాగునీరు, మజీగ, పాలు పంపిణీచేశారు. మహాశివరాత్రి సందర్భముగా ఆలయాన్ని పుష్పమాలలతో శోభాయమానముగా అలంకరించినారు. భక్తులు పొంగలి నైవేద్యములతో ఆలయము చుట్టు ప్రదక్షణలు చేసి శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులందరికి తీర్థ ప్రసాదములు అందజేసినారు. దాతలు, దేవస్థానము సహాకారముతో ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ జరిగింది. ఆర్యవైశ్యసంఘం, కాకతీయ యూత్ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేసినారు.

### స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు

శివరాత్రి పర్వదినమున ఉదయం శ్రీ మల్లేశ్వరస్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకొని పూజ కార్యక్రమములలో పాల్గొన్నారు. పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దంపతులు శ్రీ స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించినారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దంపతులు, రాష్ట్ర వ్యవసాయశాఖమాత్యులు కింజరపు అచ్చంనాయుడు దంపతులు, కురుపాం శాసనసభ్యులు జగదీశ్వరీ, హైకోర్టు న్యాయమూర్తి రవీంద్రబాబు, గుంటూరు 5వ నెంబరు జిల్లా జడ్? నీలిమ, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకొని పూజ కార్యక్రమములో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, స్వాములు, వేదపండితులు వేదఆశ్వీరవచనము చేయగా ఆలయ అధికారులు, స్వామి వారి శేష వస్త్రముతో సత్కరించి చిత్రపటము, ప్రసాదాలు అందజేసినారు.

### అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణం

శివరాత్రి పర్వదినమున రాత్రి 11.00 లకు లింగోద్భవకాలమున స్వామ వారికి ఏకాదశ ద్రవ్యములతో రుద్రాభిషేకము జరిగింది. గం.12.00 లకు గజవాహనముపై ఎదుర్కోలోత్సవము తెల్లవారుజామున గం.2.00 లకు శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారి కళ్యాణము అత్యంత వైభోపేతముగా జరిగింది. ఆలయ పునః నిర్మాణ దాతలు శ్రీ కొల్లిపర వంశీకులు వారిచే అమ్మవారికి పట్టు వస్త్రములు ముత్యాల తలంబ్రాలు సమర్పించారని ఉపకమీషనరు గోగినేని లీలాకుమారు, పాలకమండలి ఛైర్మన్ కోసూరు పూర్ణచంద్రరావు, సభ్యులు తెలిపారు.

### స్వచ్ఛంద దాతలచే అన్నదాన వితరణ

మహాశివరాత్రి సందర్భంగా పెదకాకాని శివాలయంలో శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి అన్నపూర్ణ అమ్మవారి సేవ సమితి అధ్యక్షుడు పెండెం విజయబాబు మరియు సభ్యులు శివాలయానికి విచ్చేసిన సుమారు పదివేల మంది భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమం జరిపినారు. ఈ కార్యక్రమంలో సభ్యులు హసన్ రెడ్డి,నజీర్, ధూపాటి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

సోమవారము శ్రీ భ్రమరాంబ అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అలంకారములో భక్తులను అనుగ్రహించెదరని తెలిపినారు. మంగళవారము సావ 4.00 లకు శ్రీ స్వామి వారి శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్ల దివ్య రథోత్సవము పంచ వాద్యములు, విశేష వేషధారణలతో విద్యుత్ దీపాలతో అత్యంత వైభవముగా జరుగునని తెలిపినారు అలాగే బుధవారము మధ్యాహ్నం గం.4.00 నుండి శ్రీభ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్ల తెప్పోత్సవము అత్యంత వైభవోపేతముగా వివిధ శాఖల సహాకారముతో నిర్వహించబడునని అధిక సంఖ్యలో భక్తులు తెప్పొత్సములో పాల్గోన్ని జయప్రదం చేయవలసినదిగా ఉపకమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి గోగినేని లీలాకుమారు, పాలకమండలి ఛైర్మన్ కోసూరు పూర్ణచంద్రరావు, సభ్యులు భక్తులకు విజ్ఞప్తి చేసినారు.



# మహాశివరాత్రి నాడు తిరుగూరు వెళ్తున్న సి ఎ స్వామీజీని కలిశారు

**మైలవరం, ఫిబ్రవరి :15 (లక్ష్యం ప్రతినిధి)**

వీరి పేరు ఉపేంద్ర దాస్ (బీహార్) .వీరు గంగోత్రి నుండి రామేశ్వరం వరకు అడుగడుగునా సాష్టాంగం చేసుకుంటూ వెళుతున్నారు. తిరువూరు లో దర్శించాను. మైలవరం ఎక్సైజ్ శాఖ సీఏ



# డ్రగ్స్ పై దండయాత్రలో అపశృతి



టపాసులు పేలిన సంఘటనలో గాయపడిన పీఠాధిపతి ఖాజా మొహిద్దీన్

## - ఏ ఏ ఎం టి కే దర్బార్ పీఠాధిపతి ఖాజా మొహిద్దీన్ కు తీవ్ర గాయాలు
## - మైలవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలింపు

**ఎ.కొండూరు ఫిబ్రవరి 15 (లక్ష్యం ప్రతినిధి)**

ఎ.కొండూరు మండలం చీమలపాడు గ్రామంలో శనివారం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ పై దండయాత్ర అవగాహన సైకిల్ ర్యాలీలో అపశృతి చోటుచేసుకుంది. గ్రామంలోని మెయిన్ సెంటర్ లో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద నుండి ప్రారంభమైన సైకిల్ ర్యాలీ కొత్తూరు సెంటర్ మీదగా పాతూరు చేరుకోగా,కొందరు నాయకులు ఏ ఏ ఎం టి కే దర్బార్,బాబె బొగ్దాద్ షరీఫ్ పీఠాధిపతి, సజ్జదా నషీన్, పీర్జాద సూఫీ మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా తాజ్ ఖాదిరీ బాబాను ఆహ్వానించడంతో, ర్యాలీకి ఘన స్వాగతం పలకడానికి బయటకు వచ్చిన పీఠాధిపతి ఖాజా బాబాకు, పోలీసులు బాణసంచా పేల్చే క్రమంలో శక్తివంతమైన బాంబ్ పేలి బాబా ఎడమ తొడకు బలంగా తగలటంతో ఒంటిమీద ఉన్న బట్టలు సైతం కాలిపోయి తొడకు బలమైన గాయాలయ్యి, తీవ్ర రక్తస్రావం అయింది. వెంటనే కుటుంబ సభ్యులు బాబాను మైలవరం ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. టపాసులు పేలి తొడకు తగలటం వలన పెద్ద ప్రమాదం తప్పిందని, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. గాయపడిన పీఠాధిపతి ఖాజా మొహిద్దీన్ ను మైలవరం ఏసిపి వై.ప్రసాదరావు, తిరువూరు సిఐ కె.గిరిబాబు, ఎస్ ఐ గంధం మహా లక్ష్మణుడు, పోలీస్ సిబ్బంది, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అలవాల రమేష్ రెడ్డి, టిడిపి నాయకులు గ్రామస్తులు,భక్తులు పరామర్శించారు.

# సంక్షేమంతో పాటు సంపద సృష్టికి బాటా రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసిన బడ్జెట్ 2026-27 : ప్రభుత్వ విప్ గణబాబు




**గోపాలపట్నం, ఫిబ్రవరి 15 :(లక్ష్యం ప్రతినిధి)**

ఈ రోజు విశాఖ పశ్చిమ నియోజకవర్గం కార్యాలయం, గోపాలపట్నం నందు నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ 2026-27పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ బడ్జెట్ 2026-27 రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్తుకు బ్లూ ప్రింట్‌లా రూపొందిందని, ఇది కేవలం గణాంకాల పుస్తకం కాదని, కోట్లాది మంది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే విజన్ డాక్యుమెంట్ అని పేర్కొన్నారు. మాటల కోసం కాకుండా ప్రగతి కోసం రూపొందించిన బడ్జెట్ ఇది అని స్పష్టం చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దశను, దిశను చూపే విధంగా కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను రూపొందించిందని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా వ్యవసాయం, పారిశ్రామిక రంగం, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, టూరిజం, పంచాయతీరాజ్, మహిళా సంక్షేమం తదితర రంగాలను బలోపేతం చేసే విధంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని అన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిన బడ్జెట్ ఇదని పేర్కొన్నారు. అన్ని వర్గాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రూ.3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , సంబంధిత శాఖామంత్రులను అభినందిస్తున్నామని గణబాబు తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఎన్నడూ లేని విధంగా మూలధన వ్యయానికి రూ.53,915 కోట్లు కేటాయించడం అభినందనీయమని, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.13,598 కోట్లు కేటాయించడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి అద్దం పడుతుందని అన్నారు. గత ఏడాది బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధికి రూ.300 కోట్లు కేటాయించినప్పటికీ మామిడి, ఉల్లి, కోకో, పొగాకు రైతులకు కేటాయింపులకు మించి రూ.1200 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి కింద ఆదుకోవడం జరిగిందని తెలిపారు. ఈ ఏడాది కూడా రైతులకు అండగా నిలిచేలా ధరల స్థిరీకరణ నిధికి రూ.500 కోట్లు కేటాయించడం జరిగిందని వెల్లడించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ధరల స్థిరీకరణకు ఖర్చు చేసింది రూ.880 కోట్లు మాత్రమేనని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోందని అన్నారు. పేదవారి సొంత ఇంటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో ఈ ఏడాది బడ్జెట్‌లో గృహ నిర్మాణ రంగానికి రూ.18,224 కోట్లు కేటాయించడం జరిగిందని, గత ఏడాదితో పోల్చుకుంటే రూ.4 వేల కోట్లు అధికంగా కేటాయించడం అభినందనీయమని తెలిపారు. గత ఏడాది బడ్జెట్‌లో గృహ నిర్మాణానికి రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించారని గుర్తు చేశారు. ఈ మీడియా సమావేశంలో టీడీపీ కార్పొరేటర్లు బొమ్మిడి రమణ, శరగడం రాజశేఖర్‌తో పాటు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ బాల కోటేశ్వర స్వామి వారి తిరణాల మహోత్సవం సందర్భంగా ప్రసాద వితరణ







**చెరుకుపల్లి ఫిబ్రవరి 15 (లక్ష్యం న్యూస్)**

మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో ప్రసాద వితరణ రేపల్లె నియోజకవర్గశీ ప్రజలకి, నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులుకు శ్రేయోభిలాషులకు, మిత్రులందరికీ మహాశివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు. అమర్తులూరు మండలం గోవాడ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ బాలకోటేశ్వర స్వామి వారి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా విచ్చేయు భక్తులకు పీటా పోతురాజు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైస్సార్సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పీటా మోహన్ కృష్ణ నాయకత్వం లో చెరుకుపల్లి లో ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమం లో అరుంబాక సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు, అద్దంకి వారిపాలెం ఎంపీటీసీ లుక్కా బాపనయ్య, కాటూరి శారదా, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పులి వెంకటేశ్వరరావు, విచారపు సుబ్బారావు, సూరి నారాయణ రెడ్డి, పీటా నాగరాజు, గొల్ల బిక్షాలు, చెరుకుపల్లి మండల యువ నాయకులు వాకా నాగరాజు, హరికృష్ణ రెడ్డి, వీరంకి శ్రీకాంత్, వారే చంద్రశేఖర్ రెడ్డి, నవీన్.

## సేవాలాల్ మహారాజ్‌కి వైయస్ జగన్ నివాళి



తాడేపల్లి:(లక్ష్యం న్యూస్) సేవాలాల్ మహారాజ్‌కి వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. "బంజారా ప్రజల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నతుడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్. సమాజ సేవే ఉన్నతమైన ధర్మమని చాటి చెప్పిన ఆ మహనీయుడి ఆశయాలు నేటి తరానికి ఆదర్శనీయం. నేడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా నివాళులు" అంటూ వైయస్ జగన్ ట్వీట్ చేశారు.

## 'ఏపీలోనిరంకుశ పాలన సాగుతోంది'



విజయవాడ:(లక్ష్యం న్యూస్) ఏపీలో నిరంకుశ పాలన సాగుతోందని వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ పాలనలో విఫలమైందన్నారు. తమ తప్పిదాలను కప్పి పుచ్చుకోవడానికి కూటమి నేతలు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దాలను ఏ ఒక్కటీ నెరవేర్చలేదని మండిపడ్డారు. 'ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తప్పించుకోవడానికి తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని తెరపైకి తెచ్చారు. ఏపీలో అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు రెడ్ బుక్ పాలన అమలవుతోంది. తిరుపతి లడ్డూలో ఎలాంటి జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ చెప్పింది. టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించాలని కోరినందుకు అంబటి రాంబాబుపై దాడి చేశారు. చంద్రబాబు తమ వారికి ప్రభుత్వ భూములను అన్యాయంగా తక్కువ ధరకు కట్టబెడుతున్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు' విమర్శించారు.

# బలహీన వర్గాల పెన్నిధి ఐలాపురం వెంకయ్య గారు

## -మండలి బుద్ధప్రసాద్ శాసనసభ్యులు, అవనిగడ్డ

**అవనిగడ్డ ఫిబ్రవరి 15 లక్ష్యం న్యూస్**

మాజీ శాసన మండలి సభ్యులు, మంచితనానికి మారుపేరు, శ్రీ ఐలాపురం వెంకయ్య గారు శివరాత్రి నాడు శివైక్యం చెందటం విభ్రాంతిని కలిగించింది. "మంచిచెడ్డలు ఎంచి చూడగ మనుజులందును రెండే కులములు" అన్నాడు ఒక మహానుభావుడు. అటువంటి మంచికి మారుపేరుగా తమ జీవితాన్ని ఎక్కడా రాజీపడకుండా ఆదర్శవంతముగా ఆనందముగా గడిపేవారు చాలా అరుదుగా కనిపిస్తారు. "ధనమెచ్చిన మదమెచ్చును మదమెచ్చిన మత్సరంబుమానుగ హెచ్చున్" ధనం మానవుల్ని సహజంగా గర్వితుల్ని చేస్తుంది. అది చెడ్డవారి విషయంలో. అదే ధనం మంచివారికి కలిగితే సార్ధకత చేకూరుస్తుంది. ఆ ధనానికి మరింత భద్రత ఏర్పడుతుంది. అటువంటి మంచితనం కలిగి ధనవంతులైన వ్యక్తుల్ని సమాజం గౌరవిస్తుంది. వారి వెనుక నడుస్తుంది. వారికి ఆశీస్సులనిస్తుంది. అటువంటి కోవకు చెందిన వ్యక్తి శ్రీ ఐలాపురం వెంకయ్యగారు. ఆయన కార్యశూరుడు. మీదుమిక్కిలి మితభాషి. ఒక నిరుపేద కుటుంబంలో పుట్టి అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ, విద్యాభ్యాసానికి కూడా ఆర్థిక ఇబ్బందులు వెన్నంటగా కష్టపడి మొక్కవోని ధైర్యంతో అంచెలంచెలుగా ఎదిగి నేడు ఆర్థికంగా స్థిరపడి విజయవాడ నగరంలో ప్రతిష్టాత్మకమైన 5నక్షత్రాల స్థాయి గల ఐలాపురం హోటల్‌కు అధినేతగా, అనేక సామాజిక కార్యక్రమాల్లో తనవంతు సహాయాన్ని అందిస్తూ సమాజంలో ఒక అత్యున్నత వ్యక్తిగా నిలబడ్డారంటే ఆయనలో ఉన్న కృషి, పట్టుదల, కఠోర పరిశ్రమ, క్రమశిక్షణ ఆయనను చూస్తేనే అర్థమవుతుంది.. చెరగని చిరునవ్వుతో తెల్లని పంచెకట్టుతో అచ్చ తెలుగు పెద్దమనిషిలా అందరితో కలిసిమెలసి తిరిగే అతి సామాన్య వ్యక్తిగా సమాజంలో మమేకయ్యే ధీరగంభీర స్వభావుడైన శ్రీ వెంకయ్య గారు భక్తుడుగా, సంఘసేవకుడుగా, గుప్తదాతగా, శాలివాహన సంఘ అధ్యక్షుడుగా వెనుకబడిన కులాల ఐక్యవేదిక గౌరవాధ్యక్షులుగా అనేక సేవా కార్యక్రమాలు చేశారు.

వారు శాసన మండల సభ్యులు అయిన తరువాత కుమ్మరి శాలివాహన కార్పోరేషన్ ఏర్పాటుకు, చేసిన కృషి, పడిన తపన దగ్గరగా చూశాను. వారు కుమ్మరి శాలివాహన సంఘం తరపున ప్రజా ప్రాతినిధ్యం వహించిన వారిలో



శ్రీ ఐలాపురం వెంకయ్య గారు

మొట్టమొదటివారు. కుమ్మరి శాలివాహన సంఘానికి ఒక గుర్తింపు తీసుకు వచ్చినది ఆయనే.

కుడిచేతితో చేసిన దానం ఎడమ చేతికి తెలియనీయరాదు అంటారు. ఇతరులు మనకు చేసిన సహాయాన్ని వెంటనే మరచిపోవాలి అనే కోవకు చెందిన వెంకయ్యగారు. నేను చేసినదేముంది అంతా భగవంతుని దయ అంటూ దాటవేసే గొప్ప వ్యక్తిత్వం గల గుప్తదాత ఆయన. ఇటువంటి మహానుభావులు అరుదుగా కనిపిస్తారు.

సేవాస్ఫూర్తితో స్వాతంత్ర్యయోధులను తలస్తూ వారి పేరిట స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించడం, ఉత్తమ ఉపాధ్యాయులను గౌరవించడం ఆయనకు గల దేశభక్తికి నిదర్శనాలు.

విజయవాడ ఏలూరు రోడ్డులో ఆయన నిర్మించిన కోదండ రామాలయం అనతి కాలంలోనే రామాలయం సెంటరుగా పేరుగాంచి నగరానికే ఒక ప్రత్యేకతను సంతరించి పెట్టిందంటే - ఆయన సంకల్ప బలం, ఆధ్యాత్మిక తత్పరత గొప్పవని చెప్పాలి. నగరం నడిబొడ్డున అత్యాధునిక సదుపాయాలతో ఆయనఇలాపురం హోటల్ నిర్మించారు. విజయవాడ సప్తగిరి కళాశాల ఉపాధ్యక్షులుగా, గాంధీ మహిళా కళాశాల ఉపాధ్యక్షులుగా, గాంధీ మహిళా కళాశాల కార్యనిర్వాహక సభ్యునిగా, దాతగా, వీరు చేసే విద్యాపరమైన సేవలు ఎనలేనివి.

1968 నుంచి రాష్ట్ర శాలివాహన సంఘ అధ్యక్షులుగా 16-10-94న శాలివాహన మహాసభ మరియు 24-1-99 న మరో శాలివాహన మహాసభ విజయవాడలో వీరి ఆధ్వర్యంలో అత్యున్నత స్థాయిలో నిర్వహించబడ్డాయి. 1994 లో కృష్ణాజిల్లా వెనుకబడిన కులాల సంఘాధ్యక్షులుగా, 2-1-98 న వెనుకబడిన కులాల ఐక్యవేదికకు గౌరవాధ్యక్షులుగా ఎన్నుకొనబడ్డారు. అనేక సాంఘిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ వెనుకబడిన కులాల అభ్యున్నతికి విశేష కృషి చేస్తూ అనేక గుప్తదానాలు చేస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి. ఐలాపురం వెంకయ్యగారి సామాజిక, వ్యాపార కార్యక్రమాలన్నీ తన కుమారుడు చిరంజీవి రాజా వెన్నంటి చూచుకోవడం వీరి కుటుంబ గౌరవానికి నిదర్శనం.

విజయనగరం, విశాఖ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, కడప జిల్లాలలో బలహీన వర్గాల సమావేశాలను నిర్వహించి బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించాలనే ఉద్దేశంతో వారిని సంఘటితం చేసేందుకు ఏర్పాటైన బి.సి. ఐక్యవేదికలో ప్రధాన భూమిక నిర్వహించారు.

పేదరికాన్ని లెక్కచేయక కష్టాలను సైతం ఎదుర్కొంటూ అంటెలంచెలుగా కష్టించి చెమటోడ్చి ఎదిగి అంత ఎదిగినా కించిత్తుగా గర్వం లేకుండా ఒదిగి ఉంటూ చిన్నా పెద్దలను సమానంగా గౌరవిస్తూ తన కుటుంబాన్ని, తన కులాన్ని, వెనుకబడిన వర్గాల పేదవారిని, కుల మత భేదాలు లేక అందరికీ సాయం చేసే పెద్దవాడిగా కీర్తి గడించి విజయవాడ నగరంలో విజయ పతాకాన్ని ఎగురవేసి, ఐలాపురం హోటల్ ద్వారా ఎందరో జీవితాలకే వెలుగులు పంచారు.

ప్రజా సమస్యలను ఆలోచించి పరిష్కారం కోసం, నిస్వార్ధ సేవ చేస్తూ, త్రాగునీటి కోసం అల్లాడుతున్న నగరంలోని కొన్ని మురికి వాడల ప్రజానీకానికి దాహార్తిని తీర్చేందుకు ట్యాంకుల ద్వారా ఉచితంగా మంచినీటిని సరఫరా చేసేవారు. వారి మరణం వ్యక్తిగతంగా నాకు తీరని లోటు. నన్ను. తన కుటుంబ సభ్యునిగా భావించి, అహరహం నా అభ్యున్నతి గురించి తపన పడటమే కాకుండా, కష్టాలలో ఉన్నప్పుడు వెన్నంటి నిలిచారు. విజయవాడలో వారి హోటల్ ని కేరాఫ్ అడ్రస్సుగా మార్చారు.

వారి ఆత్మకు శాంతి కలగాలని వారికి స్వర్గ ప్రాప్తి కలగాలని ప్రార్ధిస్తూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నాను.

# కౌలు రైతులను అన్యాయం చేసిన రాష్ట్ర బడ్జెట్

## -ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం

**మొవ్వ , ఫిబ్రవరి 15 లక్ష్యం న్యూస్**

రాష్ట్ర శాసనసభలో ఆర్థిక శాఖ మంత్రిగారు ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయాన్ని వ్యవసాయంలో కీలకంగా ఉన్న కౌలు రైతులను సన్నా ,చిన్నకారు రైతులకు అన్యాయం చేస్తుంది మంత్రి మాట్లాడుతూ ఎమ్మెస్ స్వామినాథన్ గారి సూక్తులను ఉదహరించి సన్న చిన్నకారు రైతులను నట్టేట ముంచి కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం చేకూరే విధంగా ఈ బడ్జెట్ ప్రతిపాదించటం అన్యాయం. ఎన్నికల ముందు గత ప్రభుత్వం కౌలు రైతులకు అన్యాయం చేసే చట్టాన్ని తెచ్చిందని భూమిలేని కౌలు రైతులకు కులాలు ఏమిటి ? అని ప్రశ్నించిన కూటమి పార్టీలు ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చి గత ప్రభుత్వం కంటే దుర్మార్గంగా కౌలు రైతులను నట్టేట ముంచుతుంది . పాత కౌలు చట్టం మారుస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో రైతులు ఇతరుల అభిప్రాయాలను సేకరించిన ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తికావస్తున్న కొత్త చట్టం తీసుకురాలేకపోవడాన్ని బట్టి భూస్వాముల వత్తిడికి లొంగిపోయింది అని అనిపిస్తుంది .

సహకార సంఘాలు ద్వారా 53.2లక్షల మంది సభ్యులకు 7600 కోట్లు రూపాయలు పంట రుణాలు ఇచ్చినట్లు గొప్పగా చెప్తున్న ప్రభుత్వం దానిలో కౌలు రైతులకు ఎంతమొత్తం ఇచ్చిందో ఎంత శాతం ఇచ్చిందో చెప్పలేకపోవటం ఈ ప్రభుత్వం యొక్క దగా కోరు విధానాలకు అద్దం పడుతుంది . అంటే ఇచ్చిన పంట రుణాలు సగటున. ఒక్కొక్కరికి 14,285 రూపాయలు మాత్రమే ఇచ్చారు అంటే ఒక అర ఎకరం సాగుకు కూడా సరిపోనంతగా పంట రుణాలు భూమి కలిగిన రైతులకు మాత్రమే ఇచ్చారు కాబట్టి ఈ ప్రభుత్వం వ్యవసాయము వ్యవసాయంలో అత్యంత అవసరమైన పంట రుణాలు ఎంత తక్కువగా అందించారో తెలుస్తుంది . ఈ బడ్జెట్లో సహకార బ్యాంకుల ద్వారా 13,598 కోట్ల రూపాయలు పంట రుణాలు ఇవ్వనన్నట్టు చెప్పారు ఇప్పుడు కూడా కౌలు రైతుల వాటా ఎంతో చెప్ప లేదు

ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధికి సంబంధించి గతంలో 300 కోట్ల రూపాయలు కేటాయించినట్లు 1200 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినట్టు చెప్పుకొంది . కానీ మళ్లీ 500 కోట్ల రూపాయలే కేటాయించారు ఈ ప్రభుత్వం రైతాంగానికి వారు పండించిన పంట మొత్తాన్ని కొనుగోలుకు కనీస మద్దతు ధరలు ఇచ్చేందుకు తగిన ప్రణాళిక ఈ బడ్జెట్ లో కనిపించలేదు .

మొత్తంగా కలిసి ఈ బడ్జెట్ కౌలు రైతులను దగా చేస్తుంది .కల్లబొల్లి మాటలు కట్టిపెట్టి కౌలు రైతులు ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం కోరుతుంది లేనిపక్షంలో కౌలు రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరిస్తుంది .

కౌలు రైతుల ప్రస్తావన లేని రాష్ట్ర బడ్జెట్ పై పవన్




కళ్యాణ్ తన వైఖరి వెల్లడించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేస్తుంది. కౌలు రైతుల ప్రస్తావనలేని రాష్ట్ర బడ్జెట్ పై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు వైఖరి ప్రకటించాలి .ఎన్నికల ముందు అధికారంలో లేనప్పుడు ఊరూర తిరిగి ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాలకి లక్ష రూపాయలు కొద్దిమందికి ఇచ్చారు. నేడు పవన్ కళ్యాణ్ గారు ఉపముఖ్యమంత్రి లాంటి ముఖ్యమైన పదవుల్లో ఉండి ఏమీ చేయలేక చేతగాని వాడిలాగా మిగిలి పోవడం ఆశ్చర్యంగా ఉంది . కాబట్టి కౌలు రైతుల ఊసేలేని ఈ బడ్జెట్ పై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు తన వైఖరి వెల్లడించాలని ఏపీ కౌంటర్ సంఘం కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు

# బి.సి. ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్సీ ఇలాపురం వెంకయ్య కన్నుమూత

**విజయవాడ, ఫిబ్రవరి 15 లక్ష్యం న్యూస్**

బి.సి. సంక్షేమ ఉద్యమ నాయకుడు, మాజీ శాసన మండలి సభ్యుడు శ్రీ ఇలాపురం వెంకయ్య (93) గారు కన్నుమూశారు. వయోభారంతో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఈరోజు ఉదయం తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలిసి రాజకీయ, సామాజిక, వ్యాపార వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

పేద కుటుంబంలో జన్మించిన వెంకయ్య గారు కష్టపడి ఎదిగి విజయవాడలో ప్రముఖ హోటల్ ఇలాపురం స్థాపకుడిగా పేరుపొందారు. కాంగ్రెస్ పార్టీలో దీర్ఘకాలంగా పనిచేసి కృష్ణా జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి శాసన మండలి సభ్యునిగా ఎన్నికై ప్రజాసేవలో 8 ఏళ్ళు విశేష పాత్ర పోషించారు. బి.సి.ల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసి, బి.సి. ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించారు.




సాలివాహన (కుమ్మర) సంఘం అధ్యక్షుడిగా దశాబ్దాల పాటు సేవలందించారు.

సామాజిక సేవల్లోనూ ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. విద్యాసంస్థలకు ఫర్నిచర్ విరాళాలు, విద్యార్థుల ప్రోత్సాహానికి సహాయం, తాగునీటి సరఫరా, ఆలయ నిర్మాణాలు, అన్నదాన సత్రాల ఏర్పాటు వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని మతాల పట్ల సమాన గౌరవంతో దేవాలయాలు, చర్చిలు, మసీదులకు విరాళాలు అందించారు.

వెంకయ్య గారికి భార్య, కుమారులు, కుమార్తెలు, మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆయన మృతికి పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, సామాజిక సేవకులు సంతాపం వ్యక్తం చేశారు. ప్రజాసేవ, బి.సి. సంక్షేమం పట్ల ఆయన చూపిన అంకితభావం చిరస్మరణీయమని వారు పేర్కొన్నారు. నాయకులు శ్రీ మండలి బుద్ధ ప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి narasimha rao ఇంకా అనేక మంది నేతలు అయన నివాసం వద్ద నివాళులు అర్పించారు

# మూడు రోజులు అన్న వితరణ చేసిన ఆరా ఫౌండేషన్

## ఆరా ఫౌండేషన్ చైర్మన్ ఆరం మస్తాన్





**చిలకలూరిపేట, ఫిబ్రవరి - 15 (లక్ష్యం న్యూస్)**

మహాశివరాత్రి పర్వదినాన రాష్ట్రంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కోటప్పకొండ తిరుణాల సందర్భంగా ప్రతి ఏడాదిలా ఈ ఏడాది ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట నుండి కోటప్పకొండకు 20 కిలోమీటర్ల దూరంలో వచ్చే భక్తులకు, ప్రబల నిర్వాహకులకు, పోలీసు వారికి ,ఆర్టీసీ వారికి ,సర్వ భక్త జనులకు అందరికీ మూడు రోజులపాటు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆరా ఫౌండేషన్ ఈ కార్యక్రమాం గత 12 సంవత్సరాలు నిర్వహిస్తుందని ఆరా ఫౌండేషన్ చైర్మన్ ఆరా మస్తాన్ తెలిపారు. కార్యక్రమాన్ని నిర్వహించడానికి మా గ్రామ ప్రజలు ,మా స్నేహితులు ,పట్టణ ప్రజల ఈ కార్యక్రమంలో పాల్గొని లక్షల మంది భక్తుల ఆకలి తీర్చడానికి ఆరా ఫౌండేషన్ పని చేస్తూ ఉంటుంది. ఇదేవిధంగా ప్రతి సంవత్సరం మహాశివరాత్రి వచ్చే భక్తులకు ఆరా ఫౌండేషన్ అన్నదాన కార్యక్రమాన్ని భక్తుల కోసం నిర్వహిస్తూనే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరా ఫౌండేషన్ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు



ప్రజా చైతన్యమే... లక్ష్యం తెలుగు దినపత్రిక
సోమవారం 16-2-2026

# భక్తులకు కోటప్పకొండ త్రికోటేశ్వరుని పైన నమ్మకం అచంచలమైన విశ్వాసం.

## మాజీ మంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి

- రాష్ట్రంలోని ప్రధానాలయాలను టెంపుల్ టూరిజం సర్క్యూట్ గా అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యం
- కూటమి పాలనలో భక్తుల మనోభావాలకు భంగం కలగకుండా ఆలయాల నిర్వహణ.
- రాష్ట్ర బడ్జెట్ 5 కోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉంది.
- మంత్రి లోకేశ్ వినూత్న ఆలోచనా ధృక్పథంతో, భవిష్యత్ లో ఉద్యోగాల వెల్లువ.
- ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం ఆలోచనలే రాష్ట్రానికి గొప్ప ఆర్థిక వనరులు.
- కోటప్పకొండ త్రికోటేశ్వరుని సకుటుంబంగా దర్శించుకున్న మాజీమంత్రి ప్రత్తిపాటి.
- చిలకలూరిపేట పట్టణం మొదలు కొండ దిగువ వరకు పలుచోట్ల అన్న వితరణ శిబిరాలు ప్రారంభించి, భక్తులకు స్వయంగా అన్నవితరణ చేసిన ప్రత్తిపాటి.


















**చిలకలూరిపేట, ఫిబ్రవరి – 15 (లక్ష్యం న్యూస్)**

కోటప్పకొండ త్రికోటేశ్వరుని భక్తులకు అచంచలమైన నమ్మకం, విశ్వాసం ఉన్నాయని, ఆ క్రమంలోనే లక్షలాది భక్తులు మహా శివరాత్రి నాడు స్వామి వారి దర్శనానికి విచ్చేస్తారని ప్రత్తిపాటి చెప్పారు. రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలన్నింటినీ ఒకే సర్క్యూట్ పరిధిలోకి తెచ్చి, టెంపుల్ టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్న ఆలోచనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని ప్రత్తిపాటి తెలియచేశారు. ప్రియతమ నాయకుడి లక్ష్యం తప్పకుండా నెరవేరుతుందని, దాంతో పర్యాటకుల ఆకర్షణలో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందని ప్రత్తిపాటి ఆశాభావం వ్యక్తంచేశారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం ఆయన కోటప్పకొండ త్రికోటేశ్వరుని దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనానికి సతీమణి వెంకట కుమారితో కలిసి వెళ్లిన ప్రత్తిపాటికి ఆలయ అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. కోటయ్యస్వామి దర్శనానంతరం అర్చకులు ప్రత్తిపాటికి వేదాశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలు అందచేశారు. స్వామి దర్శనానంతరం ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడారు.

### భక్తుల మనోభావాలకు భంగం కలగకుండా ఆలయాల నిర్వహణ

కూటమిప్రభుత్వంలో సర్వమత సమానత్వం ఉప్పొంగుతోందని, అన్ని మతాల ప్రజలు సంతోషంగా తమ ఆచారవ్యవహారాలు, పండుగలు జరుపుకుంటున్నారని ప్రత్తిపాటి చెప్పారు. ఎక్కడా కూడా భక్తుల మనోభావాలకు భంగం కలగకుండా ఆలయాల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. కోటప్పకొండకు వచ్చే మార్గంలో శివరాత్రి సందర్భంగా పలుచోట్ల ఇతర మతాల వారు కూడా అన్నదాన శిబిరాలు, మజ్జిగ మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేసి లక్షలాది భక్తుల ఆకలిదప్పులు తీరుస్తున్నారని, ఇది నిజంగా ఎంతో గర్వించాల్సిన విషయమని ప్రత్తిపాటి పేర్కొన్నారు. శివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని శైవక్షేత్రాలన్నీ శోభాయమానంగా కోట్లమంది భక్తుల కేరింతలు, ఉత్సాహంతో కళకళలాడుతున్నాయన్నారు.

### 5 కోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే బడ్జెట్

కూటమి ప్రభుత్వం ప్రకటించిన 2026–27 బడ్జెట్ రాష్ట్రంలోని 5 కోట్ల ప్రజల ఆకాంక్షలు తప్పక నెరవేర్చేలా ఉందని, అన్నివర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సమప్రాధాన్యం కల్పించారని ప్రత్తిపాటి తెలియచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంక్షేమంతో పాటు రైతులు, యువత, మహిళల ఆశల సాకారానికి బడ్జెట్ తప్పకుండా దోహదపడుతుందన్నారు. అమరావతి, పోలవరం సంపూర్తితో పాటు.. ఎన్నికల మేనిఫెస్టో అమలుకు బడ్జెట్ ఉపకరిస్తుందని ప్రజలే చెబుతున్నారని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. 15 ఏళ్ల పాటు కూటమిప్రభుత్వం అధికారంలో ఉంటే పేదరికం లేని సమాజం ప్రజలు కలలు గంటున్న స్వర్ణాంధ్రప్రదేశ్ తప్పకుండా సాకారమవుతుందన్నారు.

### మంత్రి లోకేశ్ వినూత్న ఆలోచనా దృక్పథంతో యువతకోసం ఉద్యోగాలే ఎదురుచూస్తాయి

విద్య, ఐటీ శాఖల మంత్రి, యువనేత లోకేశ్ వినూత్న ఆలోచనా ధృక్పథంతో విద్యారంగలో విప్లవాత్మక సంస్కరణలు ప్రారంభించారన్నారు. వాటి ఫలితంగా భవిష్యత్ లో యువతకోసం ఉద్యోగాలు వెల్లువలా వస్తాయని, నేటి విద్యార్థులు రేపటి యువకులుగా మారే నాటికి వారికోసం ఉద్యోగాలే ఎదురుచూసే పరిస్థితులు వస్తాయని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. పెట్టుబడుల ఆకర్షణలో మంత్రి లోకేశ్ పాదరసంలా స్పందిస్తూ వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, దానివల్లే రాష్ట్రం పెట్టుబడుల ఆకర్షణలో జాతీయస్థాయిలోనే అగ్రస్థానంలో నిలుస్తోందన్నారు.

### పలు చోట్ల అన్న వితరణ శిబిరాలు, విద్యుత్ ప్రభలు ప్రారంభించిన ప్రత్తిపాటి

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చిలకలూరిపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ లో కోటప్పకొండకు భక్తులను తరలించేందుకు ఏర్పాటు చేసిన 150 ప్రత్యేక బస్సులను పట్టణంలోని అడ్డరోడ్డు వద్ద ప్రత్తిపాటి ఉదయం ప్రారంభించారు. అనంతరం పట్టణంతో పాటు కోటప్పకొండ వెళ్లే మార్గంలో పలుచోట్ల ఏర్పాటుచేసిన అన్నదాన శిబిరాల్ని ఆయన ప్రారంభించి, స్వయంగా భక్తులకు అన్నవితరణ చేశారు. చిలకలూరిపేట పట్టణంలోని అడ్డరోడ్డు కోటప్పకొండ వెళ్ళే దారిలో శివుడి విగ్రహాన్ని ప్రతిష్ఠ చేసిన అనంతరం కాకతీయ సేవా సంఘం, శాలివాహన సంఘం, రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం, పాడురంగరావు మిత్ర మండలి, మల్లెల రాజేష్ నాయుడు ఫౌండేషన్, తేలప్రోలు రామ్మూర్తి ఆధ్వర్యంలో, కాపు సంఘం, జనసేన నాయకులు మండలనేని చరణ్ తేజ, రాజా రమేష్ ఆధ్వర్యంలో, అచ్చుకోల విజయ భాస్కర్ మిత్ర మండలి, రాధ రంగ మిత్ర మండలి, కరణం విజయ్ కుమార్ ఆధ్వర్యంలో, శివ వెల్డింగ్ వర్క్, పురుషోత్తమపట్నం నందు 30వ వార్డు నాయకులు మొహిద్దీన్ ఆధ్వర్యంలో, పురుషోత్తమపట్నం వాసుదేవ్ ఆధ్వర్యంలో, పోతవరం గ్రామ పార్టీ ఆధ్వర్యంలో, కోటప్పకొండ లో కాకతీయ కమ్మ సత్రం, జి.డి.సి.సి. బ్యాంక్ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిన అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు. కోటప్పకొండలో బాలాజీ అగ్రికల్చర్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్టాల్ ప్రారంభం చేశారు.

# కోటప్పకొండ భక్తుల వసతుల కోసం రూ. 10 లక్షల విరాళం మంత్రి గొట్టిపాటి సమక్షంలో కలెక్టర్‌కు చెక్కు అందజేసిన క్వారి అసోసియేషన్.



**నరసరావుపేట (లక్ష్యం న్యూస్)**

కోటప్పకొండ మహాశివరాత్రి తిరునాళ్లకు వచ్చే భక్తుల సౌకర్యార్థం సంతమాగులూరు మండలం గురిజెపల్లికి చెందిన శ్రీ త్రికోటేశ్వర గ్రానైట్ క్వారి అసోసియేషన్ రూ. 10 లక్షల భారీ విరాళాన్ని అందజేసింది. ఆదివారం నాడు అసోసియేషన్ ప్రతినిధులు ఈ మేరకు చెక్కును రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాకు అందజేశారు. దాతలను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు.

**మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ..**

భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ క్రమంలో క్వారి అసోసియేషన్ వారు సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి దాతృత్వం ఇతరులకు స్ఫూర్తిదాయకమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత అవగాహన స్టాల్ ..

# ప్రారంభించిన కలెక్టర్ కృత్రిక శుక్ల



**నరసరావుపేట (లక్ష్యం న్యూస్)**

కోటప్ప కొండ దిగువన రోడ్డు భద్రత అవగాహన స్టాల్ ను ప్రారంభించిన కృత్రిక శుక్ల పల్నాడు జిల్లా కలెక్టర్. మహా శివరాత్రి సందర్భంగా పల్నాడు జిల్లా కోటప్పకొండ తిరునాళ్ళ సందర్భంగా కొండ దిగువున వివిధ ప్రభుత్వ స్టాల్స్ ను జిల్లా కలెక్టర్ కృత్రిక శుక్ల ప్రారంభించారు వాటిలో పల్నాడు జిల్లా రహదారి భద్రతా కమిటీ సభ్యులు ఆర్ కనకదుర్గ పద్మజ ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన స్టాల్ ద్వారా భక్తులకు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకో వలసిన జాగ్రత్తలు గురించి వివరించడానికి ఏర్పాటు చేయడం జరిగింది. ఈ యొక్క స్టాల్ లో రోడ్డు ప్రమాదం జరిగిన సమయం లో గాయపడిన వారికి సహాయం చేయడం, డ్రైవర్లు ఫస్ట్ ఎయిడ్ గురించి తెలుసుకోవాలి అనే ఉద్దేశ్యం తో సి. పి. ఆర్ పై అవగాహన, రిఫ్లెక్టర్స్ వాటి అవశ్యకత గురించి ముఖ్యముగా ఆడియో ద్వారా రోడ్డు భద్రతా అంశాలు వినిపించటం జరిగింది.

# కలెక్టరేట్‌లో ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక‘

## ప్రతీ వారం రెవెన్యూ క్లినిక్

- మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లోనూ అర్జీల స్వీకరణ
- 1100 కాల్ సెంటర్, ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా వెల్లడి

**నరసరావుపేట (లక్ష్యం న్యూస్)**



జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు కలెక్టరేట్ లో ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక‘ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్య గురించి ఖచ్చితమైన మరియు పూర్తి వివరాలతో దరఖాస్తు చేయాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు. అర్జీదారులు గమనించాల్సినవి: సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అర్జీని సమర్పించాలి. గతంలో ఫిర్యాదు చేసిన వారు తప్పనిసరిగా పాత అర్జీ రసీదు తీసుకురావాలని సూచించారు. అర్జీలో పేరు, చిరునామా మరియు ఫోన్ నంబర్ స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు.

డిజిటల్ పర్యవేక్షణ:అర్జీదారులు తమ ఫిర్యాదు స్థితిగతులను తెలుసుకునేందుకు ప్రభుత్వం కింది సౌకర్యాలను కల్పించిందని కలెక్టర్ వివరించారు:సామీా అలర్ట్: సమస్య పరిష్కారమైన వెంటనే అర్జీదారుని ఫోన్ నంబర్‌కు మెసేజ్ వస్తుంది. వాట్సాప్ & పోస్ట్: నోటీసులు, ఎండార్స్‌మెంట్లు వాట్సాప్ ద్వారా పంపడంతో పాటు, రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఇంటి చిరునామాకు కూడా పంపిస్తారు. మున్సిపల్/మండల స్థాయిలో: జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా పీజీఆర్ఎస్ జరుగుతుంది. ప్రజలు తమ సమీప కేంద్రాల్లో ఫిర్యాదు చేయవచ్చు. ‘మీ కోసం‘ 1100 కాల్ సెంటర్:అర్జీదారులు కలెక్టరేట్‌కు రాకుండానే తమ సమస్యలను నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన 1100 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించ వచ్చునని కలెక్టర్ సూచించారు. గతంలో ఇచ్చిన అర్జీల స్టేటస్ తెలుసుకోవడానికి కూడా ఈ నంబర్‌కు కాల్ చేయవచ్చునని, అలాగే, ఎవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా అర్జీలను సమర్పించవచ్చునని సూచించారు. జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు సత్వర పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

**ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్**

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ఉదయం 10.00 గంటలకు రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. ముగ్గురు రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల తహసీల్దార్లు తప్పనిసరిగా ఉదయం 10.00 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌కు హాజరై వినతులను స్వీకరిస్తారని తెలిపారు. అలాగే ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించేందుకు సంబంధిత ఏఓ, డీటీ లు అందుబాటులో ఉంటారని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌కు మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు తమకు సంబంధించిన అన్ని రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. రైతులు మరియు ప్రజలు తమ భూసంబంధిత సమస్యలు, రెవెన్యూ సమస్యలను ఈ రెవెన్యూ క్లినిక్ ద్వారా పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# వైసీపీకి పెద్దన్నయ్య పాత్ర ఎవరిది...

నెల్లూరు,(లక్ష్యం న్యూస్)

సింహం సింగిల్.. మాది ఎప్పుడు ఒంటరి పోరాటమే. కాంగ్రెస్ పార్టీ నే లెక్క చేయలేదు.. సోనియా గాంధీనే ఖాతరు చేయలేదు.. ఇలా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రకటన లేదు. పెద్ద పెద్ద డైలాగులు ఆ పార్టీ శ్రేణులకు వెన్నతో పెట్టిన విద్య. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయాణాన్ని గమనిస్తే ఒక విచిత్రమైన పరిస్థితి కనిపిస్తుంది. ఒక బలమైన ప్రాంతీయ పార్టీగా చెప్పుకుంటూనే.. కష్టం వస్తే బిజెపి సాయం తీసుకోవడం.. అదే బిజెపికి జాతీయస్థాయిలో మద్దతు తెలపడం ఇట్టే అర్థమవుతుంది. అయితే ఇదంతా రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదు. వ్యక్తిగత కేసులతో పాటు రాజకీయ ప్రయోజనం కోసమే. అయితే ఇప్పుడు కూడా బిజెపి తమను కాపాడుతోందని బిల్డప్ ఇస్తున్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు.తాజాగా టీటీడీ లడ్డు వివాదానికి సంబంధించిన అంశాలతో రాజకీయ ప్రకంపనలు రేగుతున్నాయి ఆంధ్ర ప్రదేశ్ లో. ఇప్పుడు కూడా బిజెపి తమ వెనుక ఉందని ప్రచారం చేసుకుంటున్నాయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. అయితే జగన్మోహన్ రెడ్డి పై ఉన్న పాత కేసులు, వివేకా హత్య నుంచి మొదలుకొని తాజా స్కామ్ ల వరకు దర్యాప్తు చూస్తే ఒక అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్నట్టు ఉంది. తమ వెనుక బిజెపి ఉందని వైసీపీ నేతలు చెబుతున్నారు అంటే రాజీ పడినట్టే కదా. అయితే బలమైన ప్రాంతీయ పార్టీ అని చెప్పుకునే వైయస్సార్ కాంగ్రెస్ లేనిపోని ప్రగల్బాలు పలకడం ఏమిటంటే.. పోనీ ఏదో రాష్ట్ర ప్రయోజనాల కోసం చేస్తున్నారు అంటే అది కాదు. కేవలం జైలు శిక్షలతో పాటు కేసుల కోసమే అన్నది బహిరంగ రహస్యం. విశ్వసనీయత అనే పెద్ద మాటలు వాడితే ఆ పార్టీకే నష్టం.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కాపాడాల్సిన అవసరం భారతీయ జనతా పార్టీకి లేదు. ఎందుకంటే సిద్ధాంత పరంగా కూడా ఆ రెండు పార్టీల భావజాలం వ్యతిరేకమే. ఎందుకంటే దళితులతో పాటు మైనారిటీ ఓటు బ్యాంకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉంటుంది. ఆ రెండు వర్గాలు భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకమే. రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరే పని కాదు. గెలిచిన తర్వాత చట్టసభల్లో కేవలం మద్దతు మాత్రమే తెలుపుకోగలరు. అయితే ఏపీలో కూటమిలో ఉన్న బిజెపి మిగతా రెండు పార్టీలతో పోల్చుకుంటే తమను టార్గెట్ చేయడం లేదన్నది వైసీపీ మాట. అయితే ఏపీలో ఎలాగు పొత్తులో భాగంగా సీట్లతో పాటు ఓట్లు పెంచుకుంటుంది బిజెపి. కానీ వైసిపి చేస్తున్న ప్రచారానికి చెక్ చెప్పకుంటే మాత్రం బిజెపికే నష్టం. ఇప్పటికే వైసిపి తప్పులను ఎత్తిచూపుతోంది నేషనల్ మీడియా. మరోవైపు బిజెపి హిందుత్వవాదంతో బలంగా ముందుకు వెళుతుండగా.. ఆ వాదానికి తూట్లు పొడిచేలా వైసిపి ఏపీలో వ్యవహరించిందన్నది ప్రధాన ఆరోపణ. అటువంటి పార్టీతో అంటగాకడం నష్టమే. అయితే బిజెపిలో ఎటువంటి లోపం లేకపోయినా.. వైసిపి మాత్రం బిజెపి నీడలో ఉండాలని ప్రచారం చేసుకోవడం మాత్రం కాషాయ దళానికి నష్టం. తెలుసుకోకుంటే ఆ పార్టీకి ముప్పు.

# కోమటిరెడ్డి ధైర్యం ఏంటీ...

నల్గొండ, (లక్ష్యం న్యూస్)

తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలనే సాధించింది. ఈ విజయంతో సంబరాల ఊపులో ఉన్న టైంలోనే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని లేకుంటే డైరెక్ట్‌గా సీఎం కుర్చీనే టార్గెట్ లాక్కుంటానని హెచ్చరించారు. ఇప్పుడే కాదు ఆయన గతంలో కూడా ఇలాంటి కామెంట్స్ చాలా చేశారు. తనను పార్టీలోకి తిరిగి తీసుకున్నప్పుడు మంత్రి పదవి ఆఫర్ చేశారని ఇప్పుడు అది కావాలంటూ చాలా కాలం నుంచి పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. అయినా ఆయన్ని ఎవరూ పిలిచి మాట్లాడటం లేదు. ఆయన కామెంట్స్ ఆగటం లేదు. ఇప్పుడు మరోసారి కామెంట్స్‌తో వార్తలకెక్కారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడు. అయితే ప్రతిపక్షంలో ఉన్న టైంలో ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. తర్వాత అక్కడి నుంచి 2023 ఎన్నికల టైంలో మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి పదవి హామీతోనే పార్టీలోకి తీసుకొచ్చినట్టు ఆయన చెప్పుకుంటున్నారు. ఆయన సోదరుడైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రస్తుతం మంత్రిగా ఉన్నారు. అందుకే ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం రాజగోపాల్ రెడ్డికి మంత్రిపదవి ఇవ్వడం సాధ్యం కాదు. అయినా నాకు మంత్రి పదవి కావాల్సిందేనంటూ మొండికేస్తున్నారు. మంత్రి పదవి ఎలాగైనా సాధించుకోవాలని సమయం వచ్చినప్పుడల్లా ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ వస్తున్నారు రాజగోపాల్ రెడ్డి. రేవంత్ రెడ్డి టార్గెట్‌గా బాణాలు సంధిస్తూనే ఉన్నారు. ఆయన మాటలను ఎవరూ సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఒకట్రెండు సార్లు పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలిచి మాట్లాడింది. కానీ వాటిని పట్టించుకోవడం లేదు. అందుకే రోజు రోజుకు ఆయన విమర్శల డోసు పెరుగుతూనే ఉంది. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందించిన రాజగోపాల్ రెడ్డి మరోసారి మంత్రి పదవి అంశాన్ని ప్రస్తావించారు. పార్టీలోకి తీసుకొని వచ్చినప్పుడు తనకు ఇచ్చిన మాట ప్రకారం మంత్రిపదవి ఇవ్వాలని రాజగోపాల్ డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే డైరెక్ట్‌గా సీఎం అవుతానంటూ హెచ్చరించారు. ఇకపై పదవి కావాలని అడుక్కోవడం ఉండదని నేరుగా సమయం వచ్చినప్పుడు సీఎం సీట్లో కూర్చోవడమే ఉంటుందని హెచ్చరించారు. కచ్చితంగా తనకు మంచి పదవి వస్తుందని కూడా నమ్మకం వ్యక్తం చేశారు. ఇలా మున్సిపల్ ఎన్నికల ఫలితాల రోజున ఇలాంటి అసంతృప్తి స్వరం వినిపించడంపై కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం కూడా సీరియస్‌గా ఉంటోంది. పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటాను అంటూ గతంలో రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌పై కూడా ఇలానే రాజగోపాల్ రెడ్డి రియాక్ట్ అయ్యారు. ఇది కాంగ్రెస్ రూల్స్‌కు విరుద్ధమని పార్టీని వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చే ప్రయత్నాలు ఉన్నాయని ఎక్స్ వేదికగా విమర్శనాస్త్రాలు సంధించారు. గత ఆగస్టులో జరిగిన మంత్రివర్గ విస్తరణ టైంలో కూడా విమర్శలు చేశారు. ఆస్తులు అమ్మి పార్టీని గెలిపిస్తే తనను మోసం చేశారని మండిపడ్డారు. తనతోపాటు వచ్చిన వారికి మంత్రిపదవులు ఇచ్చారని తనను మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటేనే రాజగోపాల్ రెడ్డికి పడటం లేదు. ఆయన వేర్వేరు పార్టీల నుంచి వచ్చిన వ్యక్తిని నేరుగా సీఎం సీటులో కూర్చోబెట్టడాన్ని తప్పుపడుతున్నారు. అందుకే సమయం వచ్చినప్పుడల్లా రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్నారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటుంది రేవంతే అనే భావనలో రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. అధిష్ఠానం వద్ద ఏదో ఒకటి చెప్పి ముఖ్యమంత్రి పదవిని కాపాడుకుంటున్నారనే ఆలోచనలో ఉన్నారు. అందుకే సందర్భం ఏదైనా సరే రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్నారు. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. తనకు మంత్రి పదవి ఇవ్వకుంటే నీ కుర్చీ లాక్కుంటా అంటూ రేవంత్ రెడ్డికే పరోక్షంగా సవాల్ చేస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి వ్యవహార శైలి పార్టీ రాష్ట్ర నాయకత్వానికి తలనొప్పిగా మారుతోంది. ఓవైపు రాజగోపాల్ రెడ్డి, మరోవైపు జీవన్ రెడ్డి, ఇంకో వైపు జగ్గారెడ్డి లాంటి వాళ్లతో సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ఇలాంటి విమర్శలు ప్రత్యర్థులకు ఆయుధాలుగా మారతాయని రాష్ట్ర నాయకత్వం ఎన్ని రకాలుగా చెబుతున్నా వీళ్లు మాత్రం తమ పంథం వీడటం లేదు. సోదరుడు వెంకట్‌రెడ్డి కేబినెట్‌లో ఉండగానే రాజగోపాల్ రెడ్డికి పదవి ఎలా లభిస్తుందని పార్టీలోని కొందరు నేతలు ప్రశ్నిస్తున్నారు. స్కూల్ పిల్లాడి మాదిరిగా మారం చేస్తున్నారని అంటున్నారు.

## సూర్యప్రభవాహనంపై శ్రీ సూర్యనారాయణస్వామి అభయం

## - పరవశించిన భక్త జనం
## - 15న రథోత్సవం

**(లక్ష్యం న్యూస్)**శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన శనివారం ఉదయం 8 గంటలకు ఆదిత్య మండలం సూర్యప్రభ వాహనంపై ఖడ్గం, గద, విల్లు ధరించి శ్రీ సూర్యరాయణస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.వాహనసేవ ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్క భజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవం కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

ఆయురారోగ్యప్రాప్తి :సూర్యుడు సకల రోగ నివారకుడు, ఆరోగ్యకారకుడు, ప్రకృతికి చైతన్య ప్రదాత. ఔషధీపతి అయిన చంద్రుడు కూడా సూర్యతేజం వల్లనే ప్రకాశిస్తూ వృద్ధి పొందుతున్నాడు. ఈ వాహనంలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్య ప్రభ. సూర్య మండల మధ్యవర్తి శ్రీమన్నారాయణుడే. అందుకే సూర్యుని సూర్యనారాయణుడు అని కొలుస్తున్నాం. ఇంతటి మహాతేజఃపూర్ణమైన సూర్యప్రభ వాహనంలో ఉండే సూర్యనారాయణుడిని దర్శిస్తే ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి.

వాహన సేవలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధన శేఖర్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.ఫిబ్రవరి 15న రథోత్సవంశ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో 8వ రోజైన ఆదివారం రథోత్సవం వైభవంగా జరుగనుంది. ఉదయం 6.30 గంటలకు స్వామివారు రథారోహణం చేస్తారు. ఉదయం 7.45 గంటలకు రథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

# డీసీఎం ఢీకొని కానిస్టేబుల్ దుర్మరణం

తెలంగాణ (లక్ష్యం న్యూస్): నల్గొండ జిల్లా చందనపల్లి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మునుగోడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ షేక్ తయ్యూబ్ (30) మృతిచెందాడు. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో విధులు ముగించుకుని స్వగ్రామం నకిరేకల్‌కు బైక్‌పై వెళుతుండగా, ఎదురుగా వచ్చిన డీసీఎం వాహనం ఢీకొట్టడంతో తయ్యూబ్ అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందిన వెంటనే నల్లగొండ రూరల్ ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# కాంగ్రెస్ పతనానికి ఎమ్మెల్యే సంజయే కారణం

కరీంనగర్ (లక్ష్యం న్యూస్)

కురు సామ్రాజ్య పతనానికి శకుని ఏ విధంగా కుట్రపూరితంగా దోహదపడ్డాడో.. జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ పతనానికి.. ఎమ్మెల్యే సంజయ్ కారకుడు అయ్యాడని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపించారు. జగిత్యాలలో 40 స్థానాలు గెలుస్తామనుకుంటే.. 20-22 స్థానాలకి పరిమితమైంది. ఇప్పటికైనా మాకు స్వేచ్ఛ ఇవ్వండని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానికి వేడుకుంటున్నానని అన్నారు.

# జోష్ నింపుతున్న ఆత్మీయ కలయిక...

విజయవాడ, , (లక్ష్యం న్యూస్)

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో యువనేత, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సరికొత్త రాజకీయ ఒరవడికి శ్రీకారం చుట్టారు. కేవలం పాలన, రాజకీయాలకే పరిమితం కాకుండా, ప్రజాప్రతినిధులతో కుటుంబ సభ్యుల తరహా బంధాన్ని పటిష్టం చేసుకునే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. "ఆత్మీయ కలయిక ? ఇల్లే వేదిక" పేరుతో లోకేష్ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.సాధారణంగా రాజకీయ భేటీలు అంటే వ్యూహాలు, ప్రతివ్యూహాలు, విమర్శలు, ప్రతివిమర్శలతో కూడి ఉంటాయి. కానీ, లోకేష్ నిర్వహిస్తున్న ఈ సమావేశాలు అందుకు పూర్తి భిన్నం. ఉండవల్లిలోని తన నివాసంలో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులను వారి కుటుంబ సభ్యులతో సహా ఆహ్వానించి, ఒక ఆత్మీయ విందును ఏర్పాటు చేయడం ద్వారా లోకేష్ అందరినీ ఆశ్చర్యపరిచారు.ఈ నూతన సంప్రదాయానికి తొలి వేదికగా మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం నిలిచింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న తరుణంలో, ఎమ్మెల్యేలు తమ కుటుంబాలతో సహా లోకేష్ నివాసానికి తరలివచ్చారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కాగిత కృష్ణప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, వర్ల కుమార్ రాజా, బోడే ప్రసాద్, చీఫ్ విప్ జి.వి. ఆంజనేయులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. పార్లమెంటు సమావేశాల వల్ల ఎంపీ బాలశౌరి, విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా వెనిగండ్ల రాము ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు.ఈ కలయికలో లోకేష్ చూపిన ఆతిథ్యం ప్రత్యేకంగా నిలిచింది. తన నియోజకవర్గమైన మంగళగిరిలోని చేనేత కార్మికుల నైపుణ్యానికి గుర్తింపుగా, వచ్చిన ఆడపడుచులందరికీ మంగళగిరి పట్టుచీరలను బహూకరించి తన ఆత్మీయతను చాటుకున్నారు. ఇది కేవలం బహుమతి మాత్రమే కాదు, తన నియోజకవర్గ నేతన్నల పట్ల ఆయనకున్న గౌరవానికి, అతిథుల పట్ల ఉన్న మర్యాదకు నిదర్శనం.ఈ సమావేశంలో కేవలం మాటలు, ముచ్చట్లే కాదు.. బాధ్యత కూడా కనిపించింది. గతంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇచ్చిన వినతులపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు, వాటి తాజా స్థితిగతులపై ఒక సమగ్ర నివేదికను లోకేష్ వారికి అందజేశారు. సమస్యలు చెప్పడమే కాదు, వాటి పరిష్కారం ఎక్కడి వరకు వచ్చిందో అధికారికంగా నివేదిక ఇవ్వడం లోకేష్ పనితీరులోని పరిణతిని చూపిస్తోందని విశ్లేషకులు



అభిప్రాయపడుతున్నారుఈ తరహా సమావేశాల వల్ల పార్టీ నాయకులను కేవలం రాజకీయ యంత్రాలుగా కాకుండా, ఒక కుటుంబంగా భావించడం వల్ల వారిలో పార్టీ పట్ల విధేయత, ఉత్సాహం పెరుగుతాయి. చంద్రబాబు క్రమశిక్షణకు మారుపేరైతే, లోకేష్ ఆ క్రమశిక్షణకు 'ఆత్మీయత'ను జోడించి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటున్నారు. ఎమ్మెల్యేల నుంచి నేరుగా నియోజకవర్గ సమస్యలను తెలుసుకోవడం, వాటిపై ఫీడ్ బ్యాక్ ఇవ్వడం ద్వారా పాలనలో వేగం పెరుగుతుంది. ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులతో మమేకం కావడం ద్వారా, నాయకులకు ఇంటి నుంచే పూర్తి మద్దతు లభించేలా చేయడం లోకేష్ దార్శనికతకు అద్దం పడుతోందిలోకేష్ చేపట్టిన ఈ ఆత్మీయ కలయిక కార్యక్రమం టీడీపీలో కొత్త జోష్ నింపుతోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసే లోపు రాష్ట్రంలోని అన్ని పార్లమెంటు నియోజకవర్గాల నేతలతో ఇటువంటి భేటీలు జరగనున్నాయి. ఇది కేవలం ఒక డిన్నర్ మీటింగ్ మాత్రమే కాదు, భవిష్యత్తు నాయకత్వ పటిమను, పార్టీ పట్ల లోకేష్‌కు ఉన్న చిత్తశుద్ధిని చాటిచెప్పే ఒక రాజకీయ సంస్కరణగా చెప్పవచ్చు.ఇక మండలిలో అయితే. పాలనను గాడిలో పెడుతూ అభివృద్ధితోపాటు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోంది కూటమి. అయితే అంతకుముందు ఉన్న ప్రభుత్వం పెండింగ్లో పెట్టిన చాలా వాటిని పూర్తిచేస్తూ.. కొత్త వాటికి చెల్లింపులు చేస్తోంది. తాజాగా విద్యార్థులకు సంబంధించిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 1200 కోట్ల రూపాయలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ శాసనమండలిలో కీలక ప్రకటన చేశారు. జగన్ సర్కార్ 4వేల కోట్లను బకాయి పెట్టిందని గుర్తు చేశారు. దీనిపై శాసనమండలిలో వైసిపి పక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి లోకేష్ తీరును తప్పుపడుతూ.. సభ నుంచి వాకౌట్ చేశారు.ప్రభుత్వ విద్యావ్యవస్థకు సంబంధించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనమండలిలో పలు అంశాలను ప్రస్తావించింది.. ఈ క్రమంలో విశాఖలో గీతం విద్యాసంస్థల భూ కేటాయింపులతో పాటు వివిధ పరిశ్రమలు, సంస్థలకు భూ కేటాయింపుల విషయమై బొత్స ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా భూ కేటాయింపులు జరిపితే.. దానిని నిరూపిస్తే.. మంత్రి పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో మంత్రిగా బొత్స ఉండే సమయంలో విజయనగరం జిల్లాలో ఆయన కుటుంబ సభ్యులు.. కోట్లాది రూపాయల భూములను కారు చౌకగా కొట్టేసారని మీడియాలో కథనాలు వచ్చాయి. దీనిపై శుక్రవారం చర్చ జరిగే అవకాశం ఉందని ప్రచారం నడిచింది. ఇటువంటి పరిస్థితుల్లో మంత్రి బొత్స ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ వైసిపి సభ్యులతో కలిసి శాసనమండలిని వాకౌట్ చేయడం విశేషం. అంతకుముందు సభలో విద్యావ్యవస్థ పై జరిగిన చర్చలో బొత్సతో మంత్రి నారా లోకేష్ వాగ్వాదానికి దిగారు.వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో మంత్రిగా పనిచేశారు బొత్సపాఠశాల విద్యా శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహించారు. ఈ క్రమంలో కొన్ని రకాల చెల్లింపులు, సక్రమంగా జరగలేదు. ప్రధానంగా ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయలను అప్పటి జగన్ సర్కార్ విద్యార్థులకు అందించకుండా ఇబ్బంది పెట్టింది. ప్రైవేటు కాలేజీల్లో చేరే విద్యార్థులకు సైతం ఈ ఫీజు రియంబర్స్మెంట్ ఇస్తామని అప్పట్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సామాన్య పేద విద్యార్థులు సైతం ప్రైవేట్ కాలేజీల్లో చేరారు. కానీ ఫీజు రీయంబర్స్మెంట్ మాత్రం చెల్లించలేదు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెట్టాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఫీజు రియంబర్స్మెంట్ నిధులను ప్రాధాన్యత క్రమంలో విడుదల చేస్తూ వస్తోంది. నిన్ననే 1200 కోట్ల రూపాయలను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే విషయాన్ని లోకేష్ ఈరోజు శాసనమండలిలో ప్రస్తావించేసరికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలు తట్టుకోలేకపోయారు. అందుకే బొత్స సభను వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటన చేసి బయటకు వెళ్లిపోయారు.

# కొరియన్ లవ్ గేమ్...

## - ఢిల్లీలోనే 800 మంది మిస్సింగ్

**న్యూఢిల్లీ, (లక్ష్యం న్యూస్)**

ధ్రువ సినిమా చూశారా.. అందులో రామ్ చరణ్ శరీరంలో ఒక బగ్ ఉంటుంది. దాని ద్వారా అరవింద్ స్వామి రామ్ చరణ్ మాట్లాడిన మాటలు మొత్తం వింటూ ఉంటాడు. అతడు చేసే పనులకు కౌంటర్ ఇస్తూ ఉంటాడు. రామ్ చరణ్ ను చాలా ఇబ్బంది పెడుతూ ఉంటాడు. అటువంటి బగ్ మన శరీరంలో ఒకటి ఉంటే.. అది కూడా ఒక ఫోన్ రూపంలో ఉంటే.. ఎలా ఉంటుంది.. చదువుతుంటే ఆందోళన కలుగుతుంది కదూ.. మనదేశంలో ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో ఘజియాబాద్ నగరంలో ముగ్గురు సోదరీమణులు ఒకరి వెంట ఒకరు బలవంతంగా చనిపోయారు. దీని వెనుక భయంకరమైన కారణాలు ఉన్నాయి.రియన్ సినిమాలు అంటే చాలా ఇష్టం. కొరియన్ డ్రామాలు బాగుంటాయి. కొరియన్ సినిమాలలో నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంటుంది. ప్రారంభం నుంచి చివరి వరకు కొరియన్ సినిమాల్లో డ్రామా.. ఉత్కంఠ..ముని వేళ్ళ మీద నిలబెట్టే ఉద్వేగం ఇలా చాలా ఉంటాయి. అందువల్లే చాలామంది కొరియన్ సినిమాలను ఇష్టపడుతుంటారు.ప్రపంచానికి భిన్నంగా.. ఆలోచించడం కొరియన్ ప్రజలకు ఇష్టం. టెక్నాలజీతో వారు ఒక ఆట ఆడుకుంటారు. అయితే ఇతరుల భావోద్వేగాలను తమ గుప్పెట్లోకి తీసుకోవడం చాలా మంది కొరియన్ ప్రజలకు అలవాటు. దాన్ని ఒక ఆనందంగా వారు భావిస్తుంటారు. ప్రపంచం మొత్తం తమ చేతిలో ఉంది అని అనుకుంటారు. అందువల్లే కొరియన్ నిపుణులు కొంతమంది గేమ్స్ రూపొందించారు. ఈ గేమ్స్ కు సంబంధించిన ఏ వ్యవహారం కూడా అధికారికంగా బయటికి కనిపించదు. తయారీదారులు కూడా వారి వివరాలు బయటపెట్టరు. రకరకాల మాధ్యమాలలో తమ గేమ్స్ గురించి ప్రమోషన్ చేసుకుంటారు. ముఖ్యంగా యుక్త వయసు పిల్లల్ని లక్ష్యంగా చేసుకొని ఏదో ఒక రూపంలో వారికి దగ్గరవుతారు."నువ్వు స్మార్ట్ గా ఆలోచిస్తున్నావ్. నీ కళ్ళల్లో స్పార్క్ కనిపిస్తోంది. మీ అమ్మానాన్న పెట్టిన పేర్లతోనే నువ్వు ఉంటావా.. ఈ కొరియన్ పేరు ట్రై చెయ్.. అసలు నువ్వు స్కూల్ కి ఎందుకు వెళ్లాలి.. ఈరోజు కాలేజీకి ఎందుకు బంక్ కొట్టకూడదు.. నువ్వు ఒంటరిగా ఉంటూ జీవితాన్ని ఎందుకు ఆస్వాదించకూడదు.. ఈ నాలుగు గోడల మధ్యలోనే నువ్వు స్వేచ్ఛను ఎందుకు కోరుకోకూడదు.. కొత్త కొత్త టాస్క్ లు చేసేయ్. నీకు ప్రతిదీ ఉద్వేగంగా ఉంటుంది. చదువుకుంటే మహా అయితే ఉద్యోగం మాత్రమే చేస్తావు. ఒక కింద బానిసలాగా పనిచేయడం నీకు అవసరమా" ఇలా రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతుంటారు.టీనేజ్ పిల్లలలో భావోద్వేగాలు ఎక్కువగా ఉంటాయి. అదే సమయంలో కొరియన్ గేమ్స్ నిర్వాహకులు యూత్ పిల్లలను రెచ్చగొడుతుంటారు. ఒకరకంగా వారిని తమ ఆధీనంలోకి తీసుకుంటారు. ప్రతిరోజు ఒక టాస్క్ ఇస్తూ ఉంటారు. ఆ టాస్క్ పూర్తి చేసిన తర్వాత నువ్వు ప్రపంచంలోనే ధీరుడువి.. నీలాంటి శక్తివంతుడు ఎవరూ లేరు.. ఈ ప్రపంచంతో నీకే సంబంధం.. నీకై నువ్వు ఒంటరిగా వచ్చావు కదా.. ఒంటరిగా వెళ్తే తప్పేంటి అన్నట్టుగా యువతలో లేనిపోని ఉద్వేగాలను నూరిపోస్తుంటారు.ఆ తర్వాత వారిని తమ ఆధీనంలోకి పూర్తిగా తీసుకున్న తర్వాత.. ఈ ప్రపంచం తో నీకు సంబంధం లేదు.. నువ్విక వెళ్ళిపోవచ్చు.. ఈ టాస్క్ లో కనుక నువ్వు చనిపోతే విజేతవు.. అంటూ ఒక రకమైన ఉద్వేగాన్ని రుద్దుతారు. ఫలితంగా ఇదంతా నిజమే అని భ్రమపడి పిల్లలు.. కొరియన్ గేమ్స్ నిర్వాహకులు చెప్పినట్టుగా చేస్తుంటారు. చివరికి వారు తన ప్రాణాలను కూడా కోల్పోతుంటారఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ నగరంలో జరిగింది పైతరహా దారుణమే. అయితే ఇప్పటికీ ఈ విషయంలో ఇంకా కొన్ని తెలియని నిజాలు బయటికి రావాల్సి ఉంది. ఈ ఘటనలో ఆ ముగ్గురు పిల్లల తండ్రి చెబుతున్న మాటలు పొంతన లేకుండా ఉన్నాయి. ఇంకా దర్యాప్తు సాగుతుంది కాబట్టి ఈ వ్యవహారంలో కొన్ని విషయాలను బయటకు చెప్పడం సాధ్యం కావడం లేదు.ఘజియాబాద్ ఘటన తర్వాత కొరియన్ గేమ్స్ పై చర్చ మొదలైంది. ముఖ్యంగా బ్లూ వేల్ గేమ్ ను బ్యాన్ చేయాలని డిమాండ్ కూడా వ్యక్తం అవుతుంది. వేల్స్ లో బ్లూ వేల్స్ కొన్ని సందర్భాలలో ఒంటరిగా ఉంటాయి. ఆ తర్వాత ఎవరికి చెప్పకుండా తమను తాము బలవంతంగా చంపేసుకుంటాయి. కొరియన్ గేమ్ నిర్వాహకులు కూడా తమ రూపొందించిన ఆటకు బ్లూవేల్ గేమ్ అని పేరు పెట్టారు. అందులో బ్లూ వేల్ మాదిరిగానే చనిపోవాలని టాస్క్ ఇస్తుంటారు.. ఇది పిల్లల మెదడు పైన ఒక రకమైన ప్రభావాన్ని చూపుతుంది. తమకు తెలియకుండా తామే ఆత్మహత్య చేసుకునే విధంగా పురిగొల్పుతుంది.ఘజియాబాద్ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత ఢిల్లీలో దాదాపు 800 మంది దాకా యువతీ యువకులు మిస్సింగ్ అయ్యారని జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. దీంతో దేశవ్యాప్తంగా కలకలం నెలకొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు స్పందించారు. ఘజియాబాద్ ఘటన విషయంలో ఉత్తర ప్రదేశ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని.. ఢిల్లీలో 800 మంది యువతీ యువకులు మిస్సింగ్ అవ్వలేదని.. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తిలోకి తీసుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏది ఏమైనప్పటికీ తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా పిల్లలు ఫోన్లలో ఏం చేస్తున్నారో..ఏం చూస్తున్నారో కనిపెట్టుకొని ఉండాలి.

# అధికార పార్టీకి గౌరవం.. ప్రతిపక్షాలకు సముచితం

హైదరాబాద్, (లక్ష్యం న్యూస్)

సరిగ్గా తెలంగాణ రాష్ట్రంలో ఒక ఐదు సంవత్సరాల క్రితం మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. అప్పట్లో పెత్తనం మొత్తం కేటీఆర్ ది కాబట్టి.. అడ్డగోలుగా నిబంధనలు మొత్తం మార్చేశాడు. తన పార్టీ మాత్రమే గెలిచే విధంగా విధానాలు రూపొందించాడు. సీన్ కట్ చేస్తే సింహ భాగం మున్సిపాలిటీలలో గులాబీ పార్టీ గెలిచింది. ప్రతిపక్ష కాంగ్రెస్ గెలిచిన చోట కూడా బీఆర్ఎస్ ఆర్థిక బలంతో తొక్కి పారేసింది. క్యాంపు రాజకీయాలు స్టార్ట్ చేసింది.. కొంతమంది అభ్యర్థులను ఏకంగా అపహరించింది. ఇదే ప్రజాస్వామ్యం అంటూ కొత్త సూత్రీకరణకు దిగింది.ఇప్పుడు రేవంత్ పరిపాలన లోకి వద్దాం. ఇదేదో రేవంత్ గురించి భజన చేసే కార్యక్రమం కాదు. ఆయన పరిపాలనకు చిడతలు వాయించే వ్యవహారం అంతకంటే కాదు. బాధ్యత గల మీడియా సంస్థగా మా దృష్టికి వచ్చిన అంశాలను మా వీక్షకులకు అందించడం కోసమే ఈ కథనం పబ్లిష్ చేస్తున్నాం.తెలంగాణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చాలా తేడా ఉంటుంది. తెలంగాణలో సామాజికంగా.. రాజకీయంగా.. ఇతర వ్యవహారాలలో ప్రజలలో చైతన్యం విపరీతంగా ఉంటుంది. నచ్చిన వాళ్లను తెలంగాణ ప్రజలు నెత్తి మీద పెట్టుకుంటారు. అదే నచ్చని వాళ్ళని అయితే నేలకేసి కొడతారు. ఇందులో ఈ పార్టీ.. ఆ పార్టీ అని తేడా లేదు. అన్నిటికీ ఒకే విధమైన ట్రీట్మెంట్ ఇస్తారు తెలంగాణ ప్రజలు.సరిగ్గా ఐదు సంవత్సరాల క్రితం ఏకపక్షంగా మున్సిపల్ ఫలితాలను సాధించిన గులాబీ పార్టీ.. ఈసారి జరిగిన ఎన్నికల్లో గౌరవప్రదమైన స్థానాలను సాధించింది. కానీ ఇక్కడే కాంగ్రెస్ పార్టీ గులాబీ పార్టీకి అసలు సిసలైన ప్రజాస్వామ్య విలువలను బోధించింది. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికార దర్పాన్ని పెద్దగా వినియోగించలేదు. గులాబీ పార్టీ మాదిరిగా ఏకపక్షంగా వ్యవహరించలేదు. సాక్షాత్తు ముఖ్యమంత్రి స్వయంగా మీకు మంచి చేసే వాడిని ఎన్నుకోవాలని సూచించారు. మీకు కష్టాలు వస్తే ఆదుకునే వ్యక్తికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఆ సూత్రాన్నే తెలంగాణ ప్రజలు ఆచరించారు.అందువల్లే అధికార పార్టీకి గొప్పగా చెప్పుకునే స్థానాలు వచ్చాయి. ప్రతిపక్షాలకు గౌరవప్రదమైన స్థానాలు లభించాయి. ఎవరిని కూడా తక్కువ చూపు చూడలేదు తెలంగాణ ఓటర్లు. బిజెపికి బలం ఇచ్చారు. గులాబీ పార్టీకి పునర్జన్మ ఇచ్చారు. అధికార కాంగ్రెస్ పార్టీకి అండదండగా నిలిచారు. ఆమధ్య మహా రాష్ట్ర లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ విజయం సాధించింది. దాదాపు క్లీన్ స్వీప్ చేసేసింది. ఈ విజయాన్ని అక్కడి అధికార పార్టీ గొప్పగా చెప్పుకుంది.ఇక కేరళ రాష్ట్రంలో కూడా జరిగిన స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి షాక్ తగిలింది. చాలావరకు స్థానాలలో అక్కడి ప్రతిపక్షం విజయం సాధించింది. కొన్ని ప్రాంతాలలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు సత్తా చూపించారు.ఈ రెండు ఉదాహరణలు చాలు స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా జరిగాయో చెప్పడానికి. ప్రజలు అయితేనేమో అధికార పక్షానికి లేకుంటేనేమో ప్రతిపక్షానికి ఓట్లు వేస్తున్నారు. తమ ఆగ్రహాన్ని ఏకపక్షమైన తీర్పుగా బ్యాలెట్ బాక్స్ లో వేస్తున్నారు.కానీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ప్రజలు ప్రజాస్వామ్యాన్ని మాత్రమే కోరుకుంటున్నారు. దీనికి ప్రభుత్వం కూడా తోడు కావడంతో పరిస్థితి చాలా వరకు ఆశాజనకంగా కనిపిస్తోంది. ఉదాహరణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఏకపక్షమైన ఫలితాలు రాలేదు. అలాగని భారత రాష్ట్ర సమితి దారుణంగా ఓడిపోలేదు. చివరికి భారతీయ జనతా పార్టీ కూడా ఇక్కడ సత్తా చూపించ గలిగింది. కేవలం ఉమ్మడి పాలమూరు జిల్లా మాత్రమే కాదు.. దాదాపు తెలంగాణ వ్యాప్తంగా కూడా పరిస్థితి ఇలానే ఉంది.ఏ జిల్లాలో కూడా ఏకపక్షమైన ఫలితాలు అధికార పార్టీకి రాలేదు. అలాగని ప్రతిపక్షానికి ప్రజలు గంప గుత్తగా జై కొట్టలేదు. అధికార పక్షాన్ని గౌరవించారు. ప్రతిపక్షాన్ని భుజం తట్టి నిలబెట్టారు. ఎక్కడ కూడా ఏకపక్షమైన ఫలితాన్ని ఓటర్లు అందించలేదు. అలాగని ప్రతిపక్షాలను చిన్నచూపు చూడలేదు?తెలంగాణ రాష్ట్రంలో సామాజిక చైతన్యం ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ప్రజలు ఎవరిని కూడా భుజాల మీదకి ఎత్తుకొని మోయలేరు. అలాగని కింద కూడా పడేయలేరు. సాధ్యమైనంత వరకు సముచితమైన స్థాయిలో తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. అనేక ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు దీనిని నిరూపించారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా బలంగా చాటారు. కేరళ రాష్ట్రంలో అత్యధికంగా అక్షరాస్యత ఉంటుంది. మహారాష్ట్రలో ప్రజలకు ఆర్థిక స్థిరత్వం ఎక్కువగా ఉంటుంది. కానీ ఈ రెండు రాష్ట్రాల ప్రజలను మించి తెలంగాణ ప్రజలు వ్యవహరించారు. తమకు తామే సాటి అని నిరూపించుకున్నారు.ఫలితంగా తెలంగాణ అంటేనే విభిన్న తత్వమని మరోసారి నిరూపించారు. 2023 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి భారీగా మెజారిటీ ఇవ్వలేదు. అలాగని గులాబీ పార్టీని తక్కువ చూపు చూడలేదు. ప్రతిపక్షాన్ని గౌరవంగా ఉంచుకుంటూనే.. మార్పు కావాలని కాంగ్రెస్ పార్టీకి జై కొట్టారు. తెలంగాణ ప్రభుత్వం.. తెలంగాణ ప్రజలు వ్యవహరించిన తీరు వల్ల ప్రజాస్వామ్యం గొప్పగా వర్ధిల్లింది. "ఈసారి ఎన్నికలు బాగా జరిగాయి. చాలా స్థానాలలో హంగ్ ఏర్పడింది. ఈ ప్రకారం ఎన్నికల ప్రక్రియ ఎంత గొప్పగా జరిగిందో అర్థం చేసుకోవచ్చని" రాజకీయ విశ్లేషకులు అంటున్నారు..

# క్వింటాల్ మిరప రూ.87,786..

అనంతపురం(లక్ష్యం న్యూస్)

అనంతపురం జిల్లాలో ఓ మిరప రైతు పంట పండింది. వద్రవన్నూరుకు చెందిన తిప్పేస్వామి అనే మిరప రైతు డబ్బీ డ్రై మిరపను పండించారు. ఈ మిరప పంటను కర్ణాటకలోని బ్యాడిగి మార్కెట్ తరలించగా.. మార్కెట్లో గురువారం రికార్డు స్థాయి ధర పలికింది. క్వింటాల్ మిర్చి ఏకంగా రూ.87,786 పలికింది. దీంతో రైతును మార్కెట్ అధికారులు, వ్యాపారులు, తోటి రైతులు సన్మానించారు. పూలమాలలు వేసి, స్వీట్లు తినిపించారు.జిల్లాకు చెందిన ఓ మిరప రైతు పంట పండింది. రాయదుర్గం మండలంలోని వద్రవన్నూరుకు చెందిన తిప్పేస్వామి అనే రైతు పండించిన మిరపకు రికార్డు ధర లభించింది. తిప్పేస్వామి పండించిన డబ్బీ డ్రై మిరప.. రికార్డు స్థాయిలో క్వింటాల్ ధర రూ.87,786 పలికింది. కర్ణాటకలోని హావేరి జిల్లాలో ఉన్న బ్యాడిగి వ్యవసాయ మార్కెట్‌లో తిప్పేస్వామి పండించిన డబ్బీ డ్రై మిరపకాయలు .. ఈ రికార్డు ధర పలికాయి. దీంతో తోటి రైతులు, మార్కెట్ అధికారులు, వ్యాపారులు తిప్పేస్వామికి సన్మానం చేశారు. నాణ్యమైన మిరప పండించారంటూ పూలమాలలు వేసి, స్వీట్లు తినిపించారు. వద్రవన్నూరు రైతులు సుమారు 2 టన్నుల మిరపను బ్యాడిగి మార్కెట్‌కు తరలించారు. మంచి ధర పలకటంతో మిరప రైతులు సంబరాలు చేసుకున్నారు.మరోవైపు గత రెండేళ్లుగా మిరప రేట్లు చతికిలపడ్డాయి. ఇటీవల మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో మిరప రైతులు సంతోషంలో ఉన్నారు. మిరపలో రకాన్ని అనుసరించి రెండేళ్లతో పోలిస్తే ఈ సారి నాణ్యత ప్రకారం ఒక్కో రకం మిరప రూ.7000 నుంచి రూ.8000 వరకూ పెరిగింది. దీంతో రైతులు ఆశగా ఉన్నారు. మిర్చి ధరలు నేలచూపులు చూడటంతో రెండు ఏళ్లుగా రైతులు నష్టపోయారు. దీంతో ఈసారి మిరప సాగుకు చాలా మంది రైతులు ఆసక్తి చూపించలేదు. దీంతో ఉత్పత్తి తగ్గింది. దీనికి తోడు మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలతో పాటు పొరుగు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలోనూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయి. దీంతో మిరప పంట దిగుబడి మరింత తగ్గింది. దీంతో ఈసారి మిరపకు డిమాండ్ పెరుగుతుందని వ్యాపార వర్గాలు చెప్తున్నాయి.

**డబ్బీ డ్రై మిరపకాయలకు ఎందుకింత డిమాండ్..**

మరోవైపు డబ్బీ డ్రై మిరపకాయలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. వీటిని కర్ణాటకలోని బ్యాతగిరి ప్రాంతంలో ఎక్కువగా పండిస్తారు. నాణ్యమైన, మంచి రంగును కలిగి ఉంటాయి. తక్కువ కారం, ఎక్కువ సువాసన ఉండటంతో



డబ్బీ డ్రై మిరపకాయలకు డిమాండ్ ఎక్కువ. డబ్బీ డ్రై మిరపకాయల పొడిని సాంబార్, పచ్చళ్ల తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. వీటిలో కూడా ఏ, ఏప్లస్ గ్రేడ్ అనే రెండు రకాలు ఉంటాయి. సాంబార్, మసాలా పొడులు, చట్నీలలో ఎక్కువగా ఈ మిరపకాయల పొడిని ఉపయోగిస్తుంటారు. సాధారణ మిరపకాయలతో పోలిస్తే ముదురు ఎరుపు రంగంలో కాస్త లావుగా ఉండటంతో పాటుగా డబ్బా ఆకారంలో ఉండటంతో వీటికి ఆ పేరు వచ్చింది.

# కడప, బెంగళూరు కొత్త రైల్వే లైన్

కడప, (లక్ష్యం న్యూస్)

ఏపీలో కొత్త రైల్వే లైన్‌కు సంబంధించి కేంద్రానికి రిక్వెస్ట్ వెళ్లింది. కడప నుంచి బెంగళూరుకు కొత్త రైలు మార్గంపై రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ రైల్వే లైన్ రాయలసీమ అభివృద్ధికి కీలకమైనదని పురందేశ్వరి వివరించారు. ఈ రైల్వే లైన్‌పై సమీక్ష చేసి పనుల్ని వేగవంతం చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టుపై పలు కీలక అంశాలను ప్రస్తావించారు.ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రైల్వే ప్రాజెక్టులపై ఎంపీల నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు వెళు తున్నాయి. తాజాగా మరో కొత్త రైల్వే ప్రాజెక్టుపై రైల్వేమంత్రికి రిక్వెస్ట్ అందజేశారు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి. రాయలసీమకు కీలకమైన కడప-బెంగళూరు రైల్వే లైన్ ప్రాజెక్టు అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ఈ రైలు మార్గం రాయలసీమ ప్రాంత అభివృద్ధికి అత్యంత కీలకమైనదని పురందేశ్వరి అన్నారు. ఈ రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి పునఃసమీక్షించి, పనులను వేగవంతం చెయ్యాలని రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఏపీ రవాణాశాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ కూడా పురందేశ్వరి వెంట ఉన్నారు. వాస్తవానికి ఈ ప్రాజెక్టు 2008లో మంజూరు చేశారని.. మొత్తం 266 నుంచి 268 కి.మీ చేపట్టాల్సి ఉండగా.. కేవలం కడప-పెండ్లిమర్రి మధ్య 21 కిలోమీటర్లు మాత్రమే పనులు పూర్తి చేశారన్నారు. ఈ రైల్వే లైన్ ద్వారా కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కుకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు.రాయలసీమ అభివృద్ధికి అత్యంత కీలకమైన కడప?బెంగళూరు రైల్వే లైన్ ప్రాజెక్టును పరిశీలించి, త్వరితగతిన అమలు చేయాలని గౌరవ రైల్వే మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ గారిని కోరడం జరిగింది. 2008లో ఆమోదం పొందిన ఈ ప్రాజెక్టు ఇప్పటివరకు పరిమిత పురోగతితోనే కొనసాగుతోంది. జిల్లాలైన కడప, అన్నమయ్య ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఈ రైల్వే లైన్ ఎంతో కీలకం. కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్క్‌కు ఊతం, బెంగళూరుతో నేరుగా రైల్వే అనుసంధానం, పరిశ్రమలు వృద్ధి, విద్యార్థులు, రోగులు, ఉద్యోగార్థులకు సౌలభ్యం, పర్యాటకాభివృద్ధి ఽ ఉపాధి అవకాశాలు. ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, రాష్ట్ర ప్రభుత్వంతో వ్యయ భాగస్వామ్య విధానాన్ని మళ్ళీ పరిశీలించి, సమన్వయం చేసి, తగిన సమయంలో పూర్తి చేయాలని కోరడం జరిగింది' అని పురందేశ్వరి పోస్ట్ చేశారు.ఈ కడప- బెంగళూరు మార్గాన్ని పులివెందుల మీదుగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ముద్దనూరు-పులివెందుల- ముదిగుబ్బ- శ్రీసత్యసాయి మధ్య రూ.2,505 కోట్లతో 110 కి.మీ మేర లైన్‌కు సంబంధించి అడుగులు పడుతున్నట్లు రెండు నెలల క్రితం చర్చ జరిగింది. ఈ రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే బెంగళూరు త్వరగా చేరుకోవచ్చు

# అన్నామలై... ఏపీ నుంచి రాజ్యసభకు...

విజయవాడ, (లక్ష్యం న్యూస్)

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలపైనే ఉంది. జూన్ నెలలో ఖాళీ కానున్న నాలుగు స్థానాల కోసం మే నెలలో నోటిఫికేషన్ రానుంది. అధికార కూటమిలో అప్పుడే సమీకరణాలు వేడెక్కాయి. ముఖ్యంగా కూటమిలోని మూడు పార్టీలు ఈ స్థానాలను ఎలా పంచుకుంటాయి? అభ్యర్థులు ఎవరు? అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది.వచ్చే జూన్ 21తో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నలుగురు సభ్యుల పదవీకాలం ముగియనుంది. ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న బలాబలాల దృష్ట్యా, ఈ నాలుగు స్థానాలూ అధికార కూటమికే దక్కడం ఖాయం. ప్రచారం జరుగుతున్న దాని ప్రకారం టీడీపీ 2 స్థానాలు, బీజేపీ ఒకటి, జనసేన ఒక స్థానాన్ని పంచుకునే అవకాశం ఉంది.జనసేన పార్టీకి కేటాయించే ఒక స్థానం కోసం పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్ పేరు దాదాపు ఖరారైనట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటి నుంచి పవన్ కళ్యాణ్‌కు సన్నిహితంగా ఉండటం, ఆర్థికంగా అండగా నిలవడమే ఆయనకు సానుకూల అంశాలని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో ఇతర నేతలు కూడా ఉన్నప్పటికీ, సామాజిక, వ్యక్తిగత సమీకరణాల దృష్ట్యా పవన్ ఆయనవైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.తెలుగుదేశం పార్టీకి దక్కే రెండు స్థానాల్లో ఒకదానికి సానా సతీష్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరోసారి ఆయనకు అవకాశం ఇవ్వాలని చంద్రబాబు యోచిస్తున్నట్లు టాక్. ఇక రెండో స్థానం కోసం టీడీపీలో భారీ పోటీ నెలకొంది. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న సీనియర్లు, ఇటీవలే పార్టీలో చేరిన కీలక నేతలు ఈ సీటును ఆశిస్తున్నారు. అధిష్టానం మాత్రం సామాజిక సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థిని ఎంపిక చేసే ఆలోచనలో ఉంది.అయితే బీజేపీ నుంచి ఎవరు ఎంపికవుతారనేది ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. ఎవరి అంచనాలకు అందని విధంగా, అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తూ ఓ కొత్త పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనే కె.అన్నామలై. తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడైన అన్నామలైని ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు పంపే వ్యూహంలో కేంద్ర బీజేపీ పెద్దలు ఉన్నట్లు సమాచారం. దీని వెనుక బలమైన రాజకీయ కారణాలు ఉన్నాయని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేడి కొనసాగుతోంది. అక్కడ పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించినందుకు అన్నామలై కొంత అసంతృప్తిగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆయనను జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశపెట్టడం ద్వారా ఆ అసంతృప్తిని చల్లార్చవచ్చని హైకమాండ్ భావిస్తోంది. మాజీ ఐపీఎస్ అధికారిగా, ముక్కుసూటిగా మాట్లాడే నేతగా అన్నామలైకు దక్షిణాది యువతలో మంచి క్రేజ్ ఉంది. ఆయన రాజ్యసభలో ఉంటే దక్షిణాది సమస్యలపై గళం విప్పే అవకాశం ఉంటుంది. టీడీపీ యువనేత నారా లోకేశ్ కు, అన్నామలైకు మధ్య మంచి స్నేహం ఉంది. గతంలో అన్నామలై ఎన్నికల ప్రచారానికి కూడా లోకేశ్ వెళ్లారు. ఈ నేపథ్యంలో అన్నామలై అభ్యర్థిత్వానికి టీడీపీ నుంచి కూడా ఎటువంటి అభ్యంతరం ఉండే అవకాశం లేదు.మరోవైపు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినప్పటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు విజయసాయి రెడ్డి. అయితే ఇటీవల మళ్లీ రాజకీయాల్లో యాక్టివ్ అవుతానని ప్రకటించిన విజయసాయి రెడ్డి పేరు కూడా తెరపైకి వచ్చింది. ఆయన రాజ్యసభకు నామినేట్ అవుతారని కొందరు భావిస్తున్నప్పటికీ, అది బీజేపీ కోటాలో జరుగుతుందా లేదా అన్నది సస్పెన్స్. ఆయన ఇటీవల హిందూ ధర్మం, జాతీయ అంశాలపై చేస్తున్న వ్యాఖ్యలు బీజేపీకి అనుకూలంగా ఉండటం గమనార్హం.ఏది ఏమైనా, జూన్ రాజ్యసభ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త మలుపులు తిప్పబోతున్నాయి. అన్నామలై వంటి జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న నేత ఏపీ నుంచి వెళ్తారా? లేదా స్థానిక సమీకరణాలకే పార్టీలు మొగ్గు చూపుతాయా? అన్నది మరికొద్ది రోజుల్లో తేలిపోనుంది.

# రేవంత్ సత్తా చూపించిన ఎలక్షన్స్

వరంగల్, (లక్ష్యం న్యూస్)

మనం ఇంట్లో అన్నం తింటున్నప్పుడు.. స్వేచ్ఛగా వ్యవహరించగలుగుతాం. ఎక్కడో ఒకచోట కూర్చుని ఆహారాన్ని లాగించేస్తూ ఉంటాం. అలాకాకుండా హోటల్లో తింటే ఒక పద్ధతి ప్రకారం వ్యవహరిస్తూ ఉంటాం. ప్రాంతం మారినప్పుడు.. తినే ఆహారం మారినప్పుడు ఆటోమేటిక్ గా మన వ్యవహార శైలిలో మార్పు వచ్చేస్తూ ఉంటుంది.పై ఉపోద్ఘాతం రాజకీయాలకు కచ్చితంగా వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక ప్రాంతీయ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకుడు స్వేచ్ఛగా పనిచేసుకోగలుగుతాడు మంచి అనేది ఏదైనా జరిగితే తన ఖాతాలో వేసుకోగలుగుతాడు. నిర్ణయాలు తీసుకునే విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఉంటాడు. తనే హై కమాండ్ కాబట్టి ఇంకొకరికి సమాధానం చెప్పకుండా.. అసలు సమాధానమే చెప్పాల్సిన అవసరం లేకుండా వ్యవహరిస్తూ ఉంటాడు.కానీ ఒక జాతీయ పార్టీలో పనిచేసే వ్యక్తికి ఇలా ఉండదు. అతడు ప్రతి ఒక్కరికి సమాధానం చెప్పాలి. తీసుకునే నిర్ణయాన్ని ముందుగానే వెల్లడించాలి. పార్టీకి ఇబ్బంది రాకుండా.. ప్రభుత్వానికి ఒత్తిడి ఎదురుకాకుండా చూసుకోవాలి. ప్రతికూలతలు ఎదురైనప్పుడు సమయమనం తో.. సానుకూలతలు వచ్చినప్పుడు ఆశావాహ దృక్పథంతో పనిచేయాల్సి ఉంటుంది.తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలు సాధించింది. ఏకపక్షమైన విజయాలు కాకుండా.. గట్టి పోటీ ఎదుర్కొని మెజారిటీ స్థానాలను దక్కించుకుంది. ఇదే సమయంలో ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో స్థానాలను దక్కించుకున్నాయి.రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు కాబట్టి ఫలితాలు అంతగా ఏకపక్షంగా లేవు. అదే ఒకవేళ ప్రాంతీయ పార్టీకి గనుక రేవంత్ రెడ్డి నాయకత్వం వహిస్తే ఫలితాలు మొత్తం ఏకపక్షంగా ఉండేది. క్షేత్రస్థాయిలో అనేక ప్రతికూలతలను అధిగమించి 2023లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చాడు రేవంత్ రెడ్డి. ఎన్నికల సభల్లో కూడా అన్ని తానై నడిచాడు. ఇప్పుడు ఫలితాల విషయం కూడా రేవంత్ రెడ్డి అనేక ప్రతికూలతలను అధిగమించాడు. తనను తాను మరోసారి నిరూపించుకున్నాడు. ఒకవేళ రేవంత్ రెడ్డి స్థానంలో కేసీఆర్ లేదా కేటీఆర్ గనక ఉండి ఉంటే ఫలితాలు ఏకపక్షంగా ఉండేవి. పైగా ఎన్నికల విషయంలో గులాబీ పార్టీ అడ్డగోలుగా వ్యవహరించేది. సరిగ్గా ఐదు సంవత్సరాల క్రితం జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో పై సీన్ రిపీట్ అయింది. కాకపోతే ఈసారి కాంగ్రెస్ పార్టీ స్వేచ్ఛాయుత విధానంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల అధికార పక్షానికి గౌరవం.. ప్రతిపక్షానికి తోడ్పాటు ప్రజల నుంచి లభించాయి. ఇదిగో ఇక్కడే రేవంత్ రెడ్డి గెలిచాడని.. అసలు సిసలైన నాయకుడిగా ఆవిర్భవించాడని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చూపించడానికి ప్రధాన కారణం రేవంత్ రెడ్డి దూకుడు. రేవంత్ రెడ్డి దాదాపుగా అన్ని జిల్లాలోని ప్రధాన కేంద్రాలలో బహిరంగ సభలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో గెలవాల్సిన అనివార్యతను వెల్లడించారు. తద్వారా తెలంగాణ ప్రజలు మరోసారి కాంగ్రెస్ పార్టీ వైపు దృష్టి సారించే విధంగా చేశారు.రేవంత్ రెడ్డి పాచిక వల్ల కాంగ్రెస్ పార్టీ భారీగా స్థానాలను సాధించినప్పటికీ.. ఒక మున్సిపాలిటీ విషయంలో మాత్రం రేవంత్ రెడ్డి స్థాయి సరిపోలేదు. ఆ మున్సిపాలిటీ పేరు సిరిసిల్ల. భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ ఎలాగైనా కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని రేవంత్ రెడ్డి ప్రయత్నించారు. చివరి వరకు అన్ని రకాలుగా వ్యూహాలు అమలు చేశారు. ప్రణాళికలను పకడ్బందీగా రూపొందించారు.సిరిసిల్ల ఓటర్లు మాత్రం కాంగ్రెస్ పార్టీకి కాకుండా.. గులాబీ పార్టీకి జై కొట్టారు. ఇక్కడ 39 వార్డులకు 27 వార్డులను బిఆర్ఎస్ పార్టీ సొంతం చేసుకుంది. ఆరువార్డులలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఐదు వార్డులలో బిజెపి గెలుపును సాధించింది. ఒక వార్డులో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. తద్వారా రేవంత్ రెడ్డి పాచికలు కేటీఆర్ ముందు పారలేదు. వాస్తవానికి ఇక్కడ కాంగ్రెస్ పార్టీ గెలవడానికి అనేక రకాలుగా ప్రయత్నం చేసింది. ఎన్నికలకు ముందే ఇక్కడ భారీగా అభివృద్ధి పనులు చేసింది. కాంగ్రెస్ పార్టీలోకి వలసలను కూడా ఆహ్వానించింది. అయినప్పటికీ ఎన్నికల ఫలితాలలో మాత్రం కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది.

## ఫ్యాన్ లో జోష్ నింపిన తెలంగాణ రిజల్ట్స్

విజయవాడ, (లక్ష్యం న్యూస్)

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా నడుస్తోంది. గులాబీ పార్టీ గట్టి పోటీ ఇచ్చినట్టు కనిపించినా తుది ఫలితాల్లో మాత్రం వెనుకబడింది. ఆ పార్టీ కేవలం నాలుగు మున్సిపాలిటీల్లో మాత్రమే సత్తా చాటింది. మిగతా చోట్ల కాంగ్రెస్ హవా నడుస్తోంది. ఒకటి రెండు చోట్ల బిజెపి ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన కలవరం మొదలైంది. ఒకటి అధికార పార్టీకి అనుకూలమైన ఫలితాలు. రెండు మిత్రుడైన కెసిఆర్ పార్టీ ఓడిపోవడం ఇప్పుడు జగన్మోహన్ రెడ్డిలో ఆందోళనకు కారణం అవుతుంది. ఏపీతో పోల్చుకుంటే తెలంగాణలో గులాబీ పార్టీకి ప్రతిపక్ష హోదా వచ్చింది. గౌరవప్రదమైన అసెంబ్లీ సీట్లు కూడా దక్కాయి. కానీ ఏపీలో మాత్రం 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను కేవలం 11చోట్ల మాత్రమే వైసిపి గెలుపొందింది. కూటమి అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతోంది. ప్రభుత్వం పట్ల సంతృప్తి శాతం కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో ఏపీలో మున్సిపల్ ఎన్నికలు జరిగితే తమ పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన జగన్ మోహన్ రెడ్డి లో ఉంది.తెలంగాణలో గులాబీ పార్టీ నాయకులు బలంగా ఉన్నారు. కెసిఆర్ కు అటు కుమారుడు కేటీఆర్, ఇటు మేనల్లుడు హరీష్ రావు తో పాటు సీనియర్ నేతలంతా గట్టిగానే మద్దతుదారులుగా నిలుస్తున్నారు. గడిచిన ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో గులాబీ పార్టీ నెగ్గుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతింది. కానీ పంచాయతీ ఎన్నికల్లో మాత్రం కొంతవరకు ప్రభావం చూపగలిగింది. ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ ఏకపక్ష విజయాన్ని అడ్డుకోగలిగింది. కానీ ఆ పరిస్థితి ఏపీలో ఉంటుందా? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలబడగలదా? కనీసం ఉనికి చాటుకోగలదా? అనే అనుమానాలు ఉన్నాయి. ఎందుకంటే ఏపీలో కూటమి బలంగా ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలహీనంగా కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో మున్సిపల్ ఎన్నికలను ఫేస్ చేయడం అంత ఈజీ కాదు.ఏ ఎన్నికలు జరిగినా ఇప్పుడు అధికార పార్టీగా టిడిపి కూటమి ఉంటుంది. అందులోనూ మూడు పార్టీల మధ్య గ్యాప్ చూడాలనుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ రోజురోజుకు వారి మధ్య మంచి బంధం ఏర్పడుతోంది. రాజకీయంగా ఇచ్చిపుచ్చుకునే ధోరణి కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో వైసీపీ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు ముందుకు రాని పరిస్థితి. 2021 మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నో రకాలుగా దూకుడు ప్రదర్శించింది. చాలాచోట్ల ఏకగ్రీవాలను సైతం చేసుకుంది. ప్రస్తుతం బిజెపి సైతం కూటమిలో ఉంది. కేంద్ర ప్రభుత్వం అండ కూడా కూటమికి ఉంటుంది. పొరుగునే ఉన్న తెలంగాణలో అధికార పార్టీ హవా స్పష్టంగా కనిపించింది. అది ఏపీలో సైతం రిపీట్ అవుతుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సైతం ఇది తెలుసు. అందుకే ఆ పార్టీ నిర్ణయం ఇప్పుడు కీలకంగా మారనుంది. మున్సిపల్ ఎన్నికలను ఆ పార్టీ ఫేస్ చేస్తుందా? లేదా? అనేది ఒక అనుమానం?

# మళ్లీ ముద్రగడతో రాజకీయం

కాకినాడ, (లక్ష్యం న్యూస్)

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కాపు నేతల్లో ఒక కొత్త వివాదం ప్రారంభం అయ్యింది. ముద్రగడ పద్మనాభం కు జగన్మోహన్ రెడ్డి ప్రాధాన్యత ఇవ్వడంపై ఇప్పుడు ఆ సామాజిక వర్గం నేతలు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ముద్రగడ రాజకీయ నిర్ణయాలు బాగుండవని.. ఆయనను నమ్ముకొని రాజకీయాలు చేయడం అంత మంచిది కాదని వైసీపీ కాపు నేతలు చెబుతున్నారు. ఇటీవల అంబటి రాంబాబు ఎపిసోడ్లో ముద్రగడ పద్మనాభం లేఖ రాయడం పై కాపు నేతలు ఆగ్రహంగా ఉన్నారు. తెలుగుదేశం పార్టీ కాపు నేతలకు అన్యాయం చేసిందంటూ చెబుతూ ఆయన రాసిన లేఖ కలకలం సృష్టిస్తోంది. అయితే అది కూటమి ప్రభుత్వం కంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే సెగలు రేపినట్లు వార్తలు వచ్చాయి. అనవసరంగా ముద్రగడ పద్మనాభం ను హైలెట్ చేయడం పగదని సొంత పార్టీ నేతలే జగన్మోహన్ రెడ్డి వైఖరిపై ఆగ్రహంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.గడిచిన ఎన్నికలకు ముందు ముద్రగడ పద్మనాభం తన కుమారుడితో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముందుగా ఆయన జనసేనకు వెళ్తారని ప్రచారం నడిచింది. అయితే ఆయనతో మేలు కంటే కీడు అధికమని పవన్ కళ్యాణ్ కు చంద్రబాబు సూచించినట్లు వార్తలు వచ్చాయి. అందుకే పవన్ కళ్యాణ్ సైతం వెనక్కి తగ్గారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ముద్రగడ పద్మనాభం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పవన్ కళ్యాణ్ ను ఓడించడంతోపాటు జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేస్తానని శపథం చేశారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని కూడా సవాల్ చేశారు. అలా ఓడించకపోతే తన పేరును ముద్రగడ పద్మనాభ రెడ్డి గా మార్చుకుంటానని ప్రకటన చేశారు. అయితే ఆయన మాటలను గోదావరి జిల్లాల్లో కాపు సామాజిక వర్గం అస్సలు పట్టించుకోలేదు. అయితే పవన్ కళ్యాణ్ విషయంలో ముద్రగడ రెచ్చగొట్టిన వ్యాఖ్యలే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కాపులను దూరం చేశాయని ఆ సామాజిక వర్గ నేతలు భావించారు. ఆ ఎన్నికల్లో దారుణ ఓటమి ఎదురైంది. కానీ ఇప్పుడు కూడా జగన్మోహన్ రెడ్డి ముద్రగడ పద్మనాభంను ముందు పెట్టి రాజకీయం చేయడం ఏమిటి అనే ప్రశ్న వినిపిస్తోంది.వాస్తవానికి ముద్రగడ పద్మనాభం 1989 లోనే చివరిసారిగా ఎమ్మెల్యేగా అయ్యారు. 1995లో ప్రత్తిపాడునియోజకవర్గంలో ఆయన ఓడిపోవడంతో తిరిగి ఆ నియోజకవర్గ వైపు చూడనని తేల్చి చెప్పారు. 2009లో పిఠాపురం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2014లో ఇండిపెండెంట్గా పోటీ చేసి ఓటమి చవి చూసారు. తరచూ అభిప్రాయాలు మార్చుకోవడం, అన్ని పార్టీల నాయకత్వాలతో విభేదాలు ఏర్పడడం వంటివి ముద్రగడ పద్మనాభం కు మైనస్ గా మారాయి. ఆయన ద్వారా కాపులను ఆకర్షించాలన్న ప్రయత్నం సరి కాదన్నది వైసీపీ నేతల వాదన. తాజాగా అంబటి రాంబాబు ఎపిసోడ్లో ప్రభుత్వానికి ముద్రగడ పద్మనాభం లేఖ రాశారు. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆయన హై కమాండ్ ఆదేశాలు లేనిదే లేఖ రాయరు. అటువంటిది వంగవీటి మోహన్ రంగా, ముద్రగడ పద్మనాభం, అంబటి రాంబాబు తదితరులను టిడిపి వేధించిందని లేఖ రాశారు ఘాటుగా. అయితే దీని ద్వారా లాభం కంటే నష్టమే అధికమని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కాపులు మరింత దూరం జరుగుతారు అన్నది వారి భయం.

**తగ్గేదెలా అంటున్న అంబటి**

మాజీ మంత్రి అంబటి రాంబాబు పశ్చాత్తాప పడ్డారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి అయితే అంబటి రాంబాబును అభినందించాల్సింది పోయి అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. ఏదో ఆవేశంతో అన్న మాటలను ఆయన వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పారని.. అటువంటి వ్యక్తిని దండించడానికి మీకు చేతులు ఎలా వచ్చాయి అంటూ మాట్లాడారు. అంబటి జైలుకు వెళ్లిన తర్వాత ఆయన కుటుంబ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ కూడా.. రాజకీయ అనుభవం ఉన్న నేను ఎవరో రచ్చగొడితే.. హుందాగా ప్రవర్తించాల్సిన నేను ఆవేశంతో నోరు జారాను. ముఖ్యమంత్రిని ఉద్దేశించి అలా మాట్లాడడం తప్పి అని అన్నారని చెప్పుకొచ్చారు.. దీంతో అంబటి రాంబాబు లో బ్రహ్మాండమైన మార్పు వచ్చిందని.. ఆయన పశ్చాత్తాప పడుతున్నారని అంతా భావించారు. కానీ నిన్న మళ్ళీ రిమాండ్ కు తరలించే క్రమంలో అంబటి రాంబాబు హావభావాలు చూస్తే ఒక నిర్ణయానికి రావచ్చు. ఆయన పశ్చాత్తాప పడే రకం కాదని కూడా తేలిపోయింది.అంబటి రాంబాబు అయినా.. ఇంకొకరు అయినా వైసీపీలో ఒక స్క్రిప్ట్ ప్రకారమే మాట్లాడతారు. తాడేపల్లి నుంచి వచ్చిన ఆదేశాలను అనుసరించి కామెంట్స్ చేస్తారు. అక్కడ ప్రాయశ్చిత్తం, పశ్చాత్తాపం వ్యక్తం చేసే వారికి చోటు ఉండదు. అలా ఆశించలేము కూడా. అటువంటిది అంబటి రాంబాబు పశ్చాత్తాప పడ్డారు అంటే ఏమనుకోవాలి. నిన్ననే గుంటూరు సివిల్ జడ్జ్ కోర్టుకి వ్యానులో తీసుకు వచ్చినప్పుడు అక్కడ తనకోసం ఎదురుచూస్తున్న అనుచరులు, మీడియా ప్రతినిధులను చూసి గడ్డం కింద నుంచి చెయ్యి తిప్పుతూ.. పుష్ప సినిమాలో అల్లు అర్జున్ మాదిరిగా తగ్గేదేలే అని సైగ చేశారు. అది చూసి ఆయన అనుచరులు కూడా ఉత్సాహంగా రప్పా రప్పా అంటూ నినాదాలు చేశారు. పార్టీ డిఎన్ఏ లోనే అది నిండిపోయింది. అటువంటప్పుడు అంబటి రాంబాబు పశ్చాత్తాప పడతారని.. పడ్డారని అనుకుంటే అంతకంటే పొరపాటు ఉండదు అని అర్థమైంది. అరెస్టుకు ముందే అంబటి రాంబాబు చాలా రకాల వ్యాఖ్యలు చేశారు. సీఎం చంద్రబాబు పై కామెంట్స్ చేసే క్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నన్ను అరెస్టు చేసుకుంటారా చేసుకోండి. ఇక్కడే ఉన్నా. అరెస్టు చేస్తే బెయిల్ కూడా అడగను. ఎంత కాలమైనా జైల్లో ఉంటానని కూడా చెప్పేశారు. కానీ ఇప్పుడు ఆయన అనుకున్న మాదిరిగానే జైలు మీద జైలుకు తిరుగుతూనే ఉన్నారు. బెయిల్ కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఆయన ముఖంలో పశ్చాత్తాపం కాదు కదా.. విపరీతమైన కోపం కనిపిస్తోంది.

# మసాజ్ ముసుగులో వ్యభిచారం

హైదరాబాద్ (లక్ష్యం న్యూస్)

మసాజ్ సెంటర్ ముసుగులో సాగుతున్న వ్యభిచార ముఠా గుట్టును కేపి.హెచ్ బి పోలీసులు రట్టు చేశారు. స్థానిక అసాన వెల్ నెస్ స్పా సెంటర్పై అకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 15 మంది యువతులను రక్షించడంతో పాటు, నిర్వాహకులు, విటులు కలిపి మొత్తం 30 మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసాన వెల్ నెస్ స్పాలో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగుతున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. మగవారికి ఆడవారితో క్రాస్ మసాజ్ చేస్తామంటూ యువతులను రప్పించి, వారి ద్వారా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. మసాజ్ సెంటర్ లోపల ప్రత్యేక గదులను ఏర్పాటు చేసి ఈ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు దాడుల్లో వెల్లడైంది.

Printed,Published and owned by CHALLA MADHUSUDHANA RAO,and Printed at VEERENDRA GRAPHICSD.NO.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001. Guntur Dist, A.P. and Published at D.No.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001, Guntur Dist, A.P. R.N.I. No. APTEL/2013/48712 Editor : CHALLA MADHUSUDHANA RAO